**విలేఖరులు కావలెను**

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :90 నల్గొండ   మంగళవారం 24-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్   పేజీలు : 4   వెల : రూ.1/-


## కొత్త మలుపు.. మాజీ సీఎస్ శాంతికుమారి స్టేట్మెంట్ రికార్డ్



హైదరాబాద్, ఫోన్ ట్యాపింగ్ వివాదంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా ఈ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) రఘునందన్ రావులను విచారణకు పిలిచి వారి స్టేట్‌మెంట్లను నమోదు చేసింది. ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ 1885, సెక్షన్ 5(2) ప్రకారం, ఫోన్ ట్యాపింగ్ చేయాలంటే రాష్ట్ర హెూంశాఖ కార్యదర్శి లేదా డీజీపీ అనుమతితో పాటు, DOT (డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్) అనుమతీ తప్పనిసరి. ట్యాపింగ్ చేయాల్సిన నెంబర్ల జాబితాను రివ్యూ కమిటీ పరిశీలించి, అనుమతిని కేంద్రానికి పంపిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ప్రభాకర్ రావు నేతృత్వంలోని SIB విభాగం సుమారు 618 ఫోన్ నెంబర్లను ట్యాపింగ్ కోసం రివ్యూ కమిటీకి సమర్పించింది. అప్పట్లో సీఎస్‌గా ఉన్న శాంతి కుమారి DOTకి ఆ లిస్ట్ పంపి టెలికం అనుమతులు తీసుకున్నట్లు SIT దర్యాప్తులో తేలింది. ఇప్పటికే అదే కేసులో అప్పటి హెూంశాఖ కార్యదర్శి, ప్రస్తుత డీజీపీ జితేందర్ మరియు ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్ కుమార్‌లకు ప్రశ్నలతో కూడిన నోటీసులు జారీ చేయగా, తాజాగా శాంతి కుమారి, రఘునందన్ రావులను స్వయంగా విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కేసు మరింత లోతుగా సాగుతున్న దశలో, ఈ రెండు స్టేట్‌మెంట్లు కీలకంగా మారనున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై తీర్పు రిజర్వ్ చేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్,తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నిలపై సస్పెన్షన్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పలువురు స్థానిక సంస్థల ఎన్నిల విషయంపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టింది హైకోర్టు. పిటిషనర్లు, ప్రభుత్వం, స్టేట్ ఎలక్షన్ కమీషన్ వాదనలు పూర్తయ్యాయి. ఎన్ని రోజుల్లో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందో చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామన్న ప్రభుత్వం ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదని హైకోర్టు ప్రశ్నించింది. పదవీకాలం ముగిశాక ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తి చేయాలన్న నిబంధనను గుర్తు చేశారు పిటిషనర్లు. ఎన్నికలైనా పెట్టండి లేదా పాత సర్పంచ్ లనే కొనసాగించండి అని పిటిషనర్లు వాదనలు వినిపించారు. మరికొంత సమయం కావాలని ప్రభుత్వం కోరింది. ఎన్నికలు నిర్వహించడానికి మరో 60 రోజుల సమయం కావాలని ఎలక్షన్ కమిషన్ కోరింది. ఈ నేపథ్యంలో హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలపై తీర్పును రిజర్వ్ చేసింది. కాగా 2024 ఫిబ్రవరి 1 న తెలంగాణ సర్పంచ్ ల పదవీకాలం ముగిసింది.



## రక్షణ,అంతరిక్ష రంగంలో భారీగా పెట్టుబడులు

అమరావతి,రక్షణ, అంతరిక్ష రంగంలో రాష్ట్రం భారీగా పెట్టుబడులు ఆకట్టుకునేలా ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రక్షణ, ఏరోస్పేస్ రంగంలో నూతన సాంకేతికత, నవీన ఆవిష్కరణలకు రాష్ట్రం కేంద్రంగా మారేలా ప్రయత్నించాలన్నారు. సోమవారం సచివాలయంలో ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 4.0 పై ముఖ్యమంత్రి సమీక్షించారు. నూతనంగా తీసుకువచ్చే పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల నుంచి రూ. 1 లక్ష కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశిరచారు. ఆపరేషన్ సింధూర్‌లో భారతదేశం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించిందని, రానున్న రోజుల్లో టెక్నాలజీ ప్రధాన పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ తరహా సాంకేతికతను రక్షణపరంగా వాడుకోవడంతో పాటు... వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి చేసి, దైనందిన జీవితంలో కూడా ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని సూచించారు. దేశ రక్షణ, అంతర్గత శాంతి భద్రతలకు సంబంధించి భవిష్యత్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని... ఈ రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు నూతన పాలసీ దోహదపడాలని సీఎం అన్నారు. నేషనల్ సెక్యూరిటీకి ప్రాధాన్యత ఇచ్చేలా పలు మార్పులు సూచించారు. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సలహాదారు సతీష్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షకు హాజరై పలు సూచనలు చేశారు. ఎంఎస్‌ఎంఈ ఉత్పత్తులకు నాణ్యతా బెంచ్‌మార్క్ :మిగతా రాష్ట్రాల కంటే ఈ రంగంలోని ఎంఎస్‌ఎంఈలను ప్రత్యేకంగా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం ఏడాదికి ప్రత్యేకంగా రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయడంతో పాటు, లాజిస్టిక్స్ సబ్సిడీ వంటివి నూతన పాలసీలో పొందుపర్చాలని సూచించారు. 'ఎంఎస్‌ఎంఈలను బలోపేతం చేయాలి. అనుబంధ పరిశ్రమలలో ఉత్పత్తుల నాణ్యతలో బెంచ్‌మార్క్ ఉండేలా చూడాలి. అలాగే విలువ జోడింపు జరగాలి. మార్కెటింగ్-బ్రాండింగ్ ముఖ్యం. వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆశయం సాకారం కావాలి.' అని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రాంతాలవారీగా డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమలు



:విశాఖపట్నం-శ్రీకాకుళంలో నావల్ క్లస్టర్.... జగ్గయ్యపేట-దొనకొండ ప్రాంతంలో మిస్సైల్, ఆయుధాల ఉత్పత్తులు.... కర్నూలు-ఓర్వకల్లులో మానవ రహిత విమానాలు, డ్రోన్ల తయారీ... లేపాక్షి-మడకశిర క్లస్టర్‌లో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్.... పరిశ్రమలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తిరుపతిని రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలని, అలాగే డీఆర్డీవో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నెలకొల్పాలని ముఖ్యమంత్రి సూచించారు. మరోవైపు మడకశిర క్లస్టర్‌లో భారత్ ఫోర్జ్, ఎంఎండబ్ల్యు సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే శంకుస్థాపన చేయనున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలో రూ.22 వేల కోట్ల పెట్టుబడులు పెట్టిన 23 సంస్థలు జాతీయ రక్షణ ఉత్పత్తుల విలువ ఏడాదికి రూ.1.27 లక్షల కోట్లు ఉండగా, ఇందులో రక్షణ రంగానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థల వాటా 73 శాతం కలిగి ఉన్నాయి. 21 శాతం విలువైన ఉత్పత్తులు ప్రైవేట్ రంగం నుంచి వస్తున్నాయి. మిగిలిన 7 శాతం ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో ఉత్పత్తి అవుతున్నాయి. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ క్లస్టర్‌లో 23 సంస్థలు, రూ.22 వేల కోట్ల పెట్టుబడులు పెట్టాయి. దీంతో 17 వేల మందికి ఉపాధి లభించింది. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, వాణిజ్య-పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు.

## పూర్తి అవినీతిలో కూరుకున్న పార్టీ బిఆర్ఎస్



నిజామాబాద్,జూన్23: బిఆర్ఎస్ అవినీతిలో కూరుకుపోయిన పార్టీ అని బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ మండిపడ్డారు. బిఆర్ఎస్ నేతలను రప్పా,రప్పా జైలులో వేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి ఉదయం బిఆర్ఎస్ ను బెదిరించి సాయంత్రం మిలాఖత్ అవ్వొద్దని సూచించారు. ములాఖత్ అయితే కాంగ్రెస్ కు పుట్టగతులు ఉండవని జోస్యం చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్‌లో మాజీ మంత్రి హరీష్ రావు తప్ప, ఎవరూ గెలవరు అని చెప్పారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు ఓటమి తప్పదు అని హెచ్చరించారు. ఈ నెల 29న జిల్లాలో అమిత్ షా పర్యటన చేయనున్నారని ఎంపి అర్వింద్ పేర్కొన్నారు. ఇక్కడి పసుపుబోర్డు కేంద్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభిస్తారని అన్నారు. సోమవారం నిజామాబాద్‌లో ఎంపీ ధర్మపురి అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. జూన్ 29వ తేదీన నిజామాబాద్ జిల్లాలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యటించనున్నారని తెలిపారు. పసుపు బోర్డు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించనున్నారని చెప్పారు. నిజామాబాద్ వేదికగా పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు కొత్త శకం ప్రారంభమైందన్నారు. అలాగే దివంగత నేత డి. శ్రీనివాస్ విగ్రహావిష్కరణ చేయనున్నట్లు వివరించారు. అనంతరం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో రైతు సమ్మేళనం పేరిట కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీ అరవింద్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఈ రెండు పార్టీలు కలిసి బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబానికి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రక్షణ కవచంగా మారిందని ఆరోపించారు. 'కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రూపాయి నాణేనికి రెండు ముఖాల్లా ఉన్నాయి. కేసీఆర్ అవినీతిపై స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా అవినీతితో నిండి ఉందని,రూ. 38 వేల కోట్ల ప్రాజెక్టును రూ. 1.2 లక్షల కోట్లకు పెంచడం ద్వారా కేసీఆర్ భారీ మోసం చేశారని పేర్కొన్నారు. దీనివల్ల అధికారు లు, రాజకీయ నాయకులు వందల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. అయినా కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేయకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పట్టించుకోవడం లేదన్నారు. ఇకపోతే, కేసీఆర్ తనను తాను ఇంజినీర్, డాక్టర్ అంటూ ప్రాజెక్టును సమర్థించుకున్నా, విచారణకు వచ్చినప్పుడు కేబినెట్‌లో చర్చించి తీసుకున్న నిర్ణయం అని తప్పించుకోవడం చూస్తే బతకడానికి ప్రయత్ని స్తున్నట్టు అనిపిస్తుందని ఎద్దేవా చేశారు. 'రాహుల్ గాంధీ గతంలో కాళేశ్వరం పై సీబీఐ విచారణ డిమాండ్ చేశారు. ఇప్పుడు మాత్రం ఆ విషయాన్ని మర్చిపో యారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు అర్థం చేసుకుని, బీజేపీకి అధికారం అప్పగించేందుకు సిద్ధమవుతున్నారని ధర్మపురి అర్వింద్ అన్నారు.

## ఇరాన్‌పై దాడులకు అమెరికాలో నిరసనలు

వాషింగ్టన్,జూన్ 23: ఇజ్రాయెల్‌కు మద్దతుగా.. ఇరాన్‌లోని కీలక అణు స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించడం పట్ల ఆ దేశ ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆ క్రమంలో సోమవారం యూఎస్‌లోని బోస్టన్, వాషింగ్టన్, న్యూయార్క్ తదితర నగరాల్లో ప్రజలు రహదారులపైకి స్వచ్ఛందంగా తరలి వచ్చి ఆందోళనలు చేపట్టారు. ఆ క్రమంలో ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు ఇవ్వవద్దని.. ఇరాన్‌ను వదిలి పెట్టాలంటూ వారు ప్లకార్డులు చేత పట్టి బిగ్గరగా నినాదాలు చేశారు.రాన్‌తో ఉన్న వివాదాన్ని సైతం నిరోధించాలని ఈ సందర్భంగా అమెరికాను వారు కోరారు. అలాగే ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వడం మానేయాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సూచించారు. అదే విధంగా ఇరాన్‌తో యూదు దేశం వివాదంలో ఇకపై అమెరికాకు ఎటువంటి ప్రమేయం ఉండకూడదని వారు స్పష్టం చేశారు. అందు కోసం ప్రదర్శనకారులు బ్యానర్లు పట్టుకుని యుద్ధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆదివారం ఇరాన్‌లోని మూడు కీలక అణు స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌ను వదిలేయాలంటూ అమెరికాకు ఆ దేశ ప్రజలు సూచించారు. బోస్టన్, చికాగోలోని పలు కీలక ప్రదేశాలతో పాటు వాషింగ్టన్ డీసీలోని అధ్యక్ష భవనం వైట్ హౌస్, న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్ ఎదుట ప్రజలు ఈ ఆందోళనలు చేపట్టారు. మరోవైపు ప్రజలు ఆందోళనలకు దిగడంతో పలు నగరాల్లో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో సంస్కృతిక, మతపరమైన, దౌత్య కార్యాలయల వద్ద భారీగా భద్రతా బలగాలను మోహరించారు. ంకోవైపు అమెరికా వైమానిక దాడులపై ఇక్యరాజ్యసమితిలోని ఇరాన్ రాయబారి అమిర్ ఇర్వానీ స్పందారు. ఆ క్రమంలో అమెరికాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ యుద్ధంలో జోక్యం చేసుకోవద్దని చెప్పినా.. తమ మాటను అమెరికా పెడ చెవిన పెట్టిందని పేర్కొన్నారు. అమెరికాపై ఎప్పుడు.. ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది సైన్యం చూసుకుంటుందని ఇర్వానీ స్పష్టం చేశారు. అంతకు ముందు ఇరానీ సుప్రీం కమాండర్ ఖమేనీ మాట్లాడుతూ.. ఇజ్రాయెల్‌పై నిప్పులు చెరిగారు. కానీ ఇరాన్‌లోని అణు స్థావరాలపై వైమానిక దాడులు చేసిన అమెరికాను ఒక్క మాట అనకపోవడం గమనార్హం. ఇరాన్‌లో కీలక అణు స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్ స్పందించింది. ఈ దాడులతో దౌత్య సంబంధాలను అమెరికా నాశనం చేస్తుందంటూ ఐక్యరాజ్యసమితిలోని ఇరాన్ రాయబారి అమిర్ సయ్యద్ ఇర్వానీ మండిపడ్డారు. అయితే అమెరికా వ్యవహారాన్ని ఎప్పుడు ఏం చేయాలనేది తమ దేశ సైన్యం చూసుకుంటుందని ఇర్వానీ స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన చర్యలు చేపడుతుందని వివరించారు. ఆదివారం ఇరాన్‌లోని ముఖ్య అణు స్థావరాలు.. ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌పై అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితిలోని భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా అంతర్జాతీయంగా శాంతి, భద్రతల కు పొంచి ఉన్న ముప్పు అనే అంశంపై చర్చించింది. ఈ సందర్భంగా ఇరాన్ రాయబారి అమిర్ సయ్యద్ ఇర్వానీ మాట్లాడుతూ.. ఈ యుద్ధంలో జోక్యం చేసుకోవద్దంటూ అమెరికాను పదే పదే తాము సూచించినట్లు వివరించారు. జూన్ 13, జూన్ 21వ తేదీల్లో ఇరాన్‌పై ఇజ్రాయెల్, యూఎస్ నిర్వహించిన దాడులను ఈ సందర్భంగా ఇర్వానీ ఖండించారు. ఈ రెండు దేశాలు అంతర్జాతీయ చట్టాలను అతిక్రమించాయని మండిపడ్డారు. యూఎస్, బ్రిటన్, ఫ్రాన్స్‌తోపాటు యూరోపియన్ యూనియన్‌లు రాజకీయ, చట్టవిరుద్ధంగా ప్రేరేపించిన చర్యల ఫలితంగా అవి జరిగాయని పేర్కొన్నారు. దౌత్య మార్గాలను ఇజ్రాయెల్ నాశనం చేస్తుందని విమర్శించారు. దౌత్యాన్ని నాశనం చేయాలని ఆ దేశం కంకణం కట్టుకుందంటూ ఇజ్రాయెల్‌పై ఇర్వానీ నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమెన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిపై ఇర్వానీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దౌత్య సంబంధాలును అమెరికా నాశనం చేయాలని నిర్ణయించుకుందని గత వారం పలు యూరోపియన్ సభ్య దేశాలతో ఇరాన్ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జరిపిన చర్చల్లో స్పష్టమైందని తెలిపారు. అలాంటి వేళ.. ఈ పరిస్థితిని ముగింపు ఎక్కడని ఇర్వానీ ఈ సందర్భంగా ప్రశ్నించారు.




### ఇజ్రాయిల్‌లో రష్యన్‌ల జనాభా ఎక్కువ

మాస్కో, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్ పై దాడులు చేస్తోన్న ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా కూడా రణరంగంలోకి దిగింది. టెహ్రాన్‌లో మెరుపుదాడులు చేసింది. ఇంత జరుగుతున్నా.. ఇరాన్‌కు సుదీర్ఘకాలంగా మిత్రదేశమైన రష్యా సాయం చేసేందుకు ముందుకురాకపోవడంపై ఆశ్చర్యం నెలకొంది. దీనిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందించారు. ఈ యుద్ధంలో తాము తటస్థంగా ఎందుకు ఉంటున్నామో వివరించారు.

## అహ్మదాబాద్ ఘటనతో తేరుకున్న ప్రభుత్వం



న్యూఢిల్లీ,జూన్ 23: అహ్మదాబాద్ విమాన ప్రమాద దుర్ఘటన తరవాత కేంద్రం అప్రమత్తం అయ్యింది. అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. విమాన ప్రయాణపై ప్రజల్లో భయాందోళనలు తొలగించడంతో పాటు, ప్రమాదాల నివారణకు కఠిన చర్యలకు ఉపక్రమించింది. భారతదేశంలో వాయు రవాణా వ్యవస్థను సమగ్రంగా అంచనా వేసేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ అవియేషన్ కొత్తగా స్పెషల్ ఆడిట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కొత్త ఆడిట్ విధానంతో వాయు రవాణా రంగం అన్ని శాఖలను సమగ్రంగా పరిశీలించనుంది. దీంతోపాటు ఇలాంటి ఆడిట్‌లు కేవలం విమానాలు నడపగలిగే పనితీరును మాత్రమే కాకుండా, విమానాశ్రయాల మెయింటనెన్స్, శిక్షణ సంస్థలు, గ్రౌండ్ హ్యాండ్లింగ్ ఏజెన్సీల పనితీరును కూడా చెక్ చేయనున్నాయి. ప్రస్తుతం భారతదేశంలోని వాయు రవాణా పరిశ్రమలో భద్రతా పరిశీలనలు ఎక్కువగా విభాగాల మధ్య బిడ్ పద్ధతుల్లో జరుగుతాయి. ఆఉఅం వివిధ విభాగాల నుంచి చేసిన పర్యవేక్షణలు మాత్రమే చేసేవిగా ఉంటాయి. ఉదాహరణకు ఎయిర్ లైన్స్ విషయంలో భద్రతా తనిఖీలు, విమానాశ్రయాలలోని భద్రత, విమానాల లోడ్ ఆపరేషన్స్ మొదలైనవి ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఈ విధానంలో ప్రతీ అంశం కూడా ఒక్కో విభాగం కింద చేసేవిగా ఉంటాయి. ఈ కొత్త స్పెషల్ ఆడిట్ విధానం ఆయా విభాగాలను విడివిడిగా చూసే బదులు, వాటిని సమగ్రంగా చూసే కార్యక్రమాన్ని రూపొందించింది. ఇటీవల అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లే ఎయిర్ ఇండియా విమానం ఆకస్మికంగా క్రాష్ అయ్యింది. ఈ ఘటన తర్వాత భద్రతా వ్యవస్థలో కొన్ని లొపాలు, మార్పుల అవసరాన్ని ప్రస్తావించింది. దీంతో, ఆఉఅం ఈ కొత్త ఆడిట్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ప్రకారం ప్రత్యేక మల్టీడిసిప్లినరీ జట్లు ఏకతాటిపై పనిచేస్తాయి. ఈ జట్లలో ఆఉఅం నుంచి వివిధ విభాగాల అధికారులు ఉంటారు. ఉదాహరణకు లట్ స్టాండర్డ్స్, ఎయిర్ సేఫ్టీ, ఎయిర్ వర్ధనెస్, ఎరోడ్రోమ్ స్టాండర్డ్స్, ఎయిర్ నావిగేషన్ వంటి విభాగాలు ఉంటాయి. అవసరమైతే, బయటి నిపుణుల సహాయం కూడా తీసుకుంటారు. భద్రతా నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు ద్వారా ఎప్పటికప్పుడు ఉండే ఆపరేషన్ల భద్రతా నిర్వహణ విధానాలను పరిక్షించడం జరుగుతుంది. ఆపరేషనల్ ప్రాక్టీసెస్ స్థితి ద్వారా ఆపరేషన్ల సరళతను, పరిశ్రమలలో అనుసరించే పద్ధతులు, వాటి సమర్థతను పరిశీలించడం చ ఏస్తారు. అన్ని పరిరక్షణలు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉంటాయి. ఈ ఆడిట్లు వివిధ విధానాలను పాటిస్తాయి. వాటిలో ఒక్కో సైట్ లో తనిఖీలు, డాక్యుమెంట్ సమీక్షలు, ఉద్యోగులతో ఇంటర్వ్యూ, భద్రతా డేటా విశ్లేషణ, శిక్షణ రికార్డుల పరిశీలన మొదలైన వాటిని పరిగణలోకి తీసుకుంటారు. ఈ ప్రత్యేక ఆడిట్లు సాధారణ సంవత్సర పర్యవేక్షణ ధోరణుల కన్నా మరింత ప్రగతిశీలంగా ఉంటాయి. విమానాలు, విమానాశ్రయాలు మాత్రమే కాకుండా, మెంటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్ సేవలు, శిక్షణ అకాడమీలు, అత్యవసర స్పందన వ్యవస్థలు, సరఫరా వంటి విభాగాలన్నింటినీ సమగ్రంగా ఆడిట్ చేస్తాయి. ఈ ఆడిట్లు సాధారణంగా వార్షిక పర్యవేక్షణ లేదా ఆపరేషన్ తర్వాత సమీక్ష మాదిరిగా ఉంటాయి. కానీ కొన్ని ఘటనలు, ఉల్లంఘనలు లేదా ఎఅంక్ష (ఇంటర్నేషనల్ సివిల్ అవియేషన్ ఆర్గనైజేషన్) దృష్టిలోకి వచ్చిన అంశాల ఆధారంగా అనుకోని సమయంలో కూడా ఆడిట్‌లు నిర్వహించే అవకాశం ఉంది.

### ఇరాన్‌పై విరుచుకు పడుతున్న ఇజ్రాయిల్

టెలీఅవివ్, ఇరాన్ వైమానిక స్థావరాలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దేశంలో పశ్చిమ, తూర్పు, మధ్య ప్రాంతాల్లో గల ఆరు వైమానిక స్థావరాలపై భీకర దాడులు చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మిలిటరీ తాజాగా వెల్లడించింది. దాడుల తాలూకు వీడియోలు కూడా షేర్ చేసింది. 15 యుద్ధ విమానాలతో ఈ దాడులు చేశామని తెలిపింది. రన్‌వేలు, భూగర్భంలోని బంకర్‌లు, ఓ రీఫ్యుయెలింగ్ ప్లేన్, ఎఫ్-14, ఎఫ్-5, ఏహెచ్-1 విహంగాలు, హెలికాప్టర్‌లు ధ్వంసమయ్యాయని పేర్కొంది. ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించాలనుకున్న యుద్ధ విమానాలను ధ్వంసం చేసినట్టు తెలిపింది.

## సంపాదకీయం

మంగళవారం 24-06-2025

# యోగాను సైన్సు ఎందుకు అంగీకరించదు..

కొన్నేళ్ళ క్రితం వరకూ శారీరక శ్రమ ఎక్కువగా ఉండేది. అప్పటివారు చేసే పనులన్నీ జీవన శైలిలో అంతర్భాగంగా ఉండేవి. ప్రత్యేకంగా వ్యాయామం చేయడం ఉండేది కాదు. పరిశ్రమలు పెరిగి, యంత్రాలు వచ్చి శారీరక శ్రమ స్థానంలో బుద్ధి బలానికి విలువ పెరుగుతున్నకొద్దీ వ్యాయామం అవసరమైంది. ఆటలు అవసరమయ్యాయి. అందుకే అన్ని రకాల వ్యాయామాల్ని, జిమ్నాస్టిక్స్‌ని, ఆటల్ని, క్రీడల్ని సైన్సు ఆమోదించింది. ముక్కు మూసుకుని చేసే ధ్యానాన్ని, యోగాను, సమాధిని సైన్సు అంగీకరించలేదు. ఆటలకూ, క్రీడలకూ దేవుడితోనూ, మతాలతోనూ సంబంధం లేదు. కానీ, హిందూ మతానికి సంబంధించి కొందరు యోగాను, ధ్యానాన్ని, సమాధిని పరమాత్మలో లీనమయ్యేందుకు మార్గంగా ఎంచుకున్నారు. ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక చింతనకు లంకె పెట్టారు. అందువల్ల వీటిని సైన్సు గుర్తించదు. మత ధర్మాల్లాగా ఇవీ విశ్వాసాలుగా ఉండిపోతాయి. ముందుగా ఆ తేడాను గమనిస్తే వాటి వాటి స్థానాలేమిటో బోధపడుతుంది. యోగాను ప్రతిపాదించిన పతంజలి "యోగ: చిత్తవృత్తి నిరోధక:" అన్నాడు. అంటే యోగ ఆలోచనల్ని స్థంభింపజేస్తుందని అర్థం! అంతే కాదు. యోగ మోక్షానికి మార్గమనే చెప్పాడు పతంజలి–అంతేకాని, ఆరోగ్య సాధన కోసం ఇది పనికొస్తుందని చెప్పలేదు. ఇటీవలి కాలంలో ఆధునిక యోగా గురువులు వారి వారి ఆలోచనల్ని జోడించి, జనాన్ని మభ్యపెడుతూ వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ ఆధునిక వ్యాపార గురువులు యోగ క్యాన్సర్‌నీ, ఎయిడ్స్‌నీ కూడా తగ్గిస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. పతంజలి–యోగాను ప్రతిపాదించిన కాలానికి క్యాన్సర్, ఎయిడ్స్ వంటి వ్యాధులు గుర్తించబడలేదు. యోగ ఈ వ్యాధుల్ని తగ్గిస్తుందంటే మరి నిరూపణ ఏదీ? వారి దగ్గర నిరూపణ ఏదీ లేదని కూడా మనకు తెలుసు. అయినా కూడా వారు పెట్టే 'చెవిలో పువ్వుని భక్తితో పెట్టించుకుని, వారి పిట్టకథలు వింటూ ఉండాలని వారి కోరిక! యోగాతో సర్వ రోగాలూ మటుమాయం అయ్యే మాటైతే–నిత్యం యోగాను పాటించిన రామకృష్ణ పరమహంస, రమణ మహర్షులను క్యాన్సర్ ఎందుకు కబళించిందీ? మనకు మనం ఆలోచించుకోవలసిన విషయాలు. 'యోగ'–అంటే వ్యాయామం అనే అర్థం కూడా ఉంది కదా? మరి దాన్ని తీసుకుంటే తప్పేమిటి? అనేవారు కొందరుంటారు. దేహ దారుఢ్యానికి ఉపయోగపడే పరేడ్ సైనికులకు, ఎన్.సి.సి. కాడిట్‌లకు ఉంటుంది. స్కూలు పిల్లలకు డ్రిల్ పీరియడ్ ఉంటుంది. యోగ ఇలాంటి శారీరక వ్యాయామాల కిందికి రాదు. వైద్య రంగంలో 'ఫిజియోథెరపీ ట్రీట్‌మెంట్ ఉంది. ఏ రోగికి ఎలాంటి వ్యాయామం అవసరమో, అది ఎంత కాలం చేయాల్సి ఉంటుందో వైద్య నిపుణులు నిర్ణయిస్తారు. జిమ్‌లో కూడా ట్రైనర్లు ఉంటారు. మీ ధ్యేయమేమిటో తెలుసుకుని, మీకు ఎలాంటి వ్యాయామం అవసరమో వారు అలాంటివి నిర్ధారిస్తారు. చెప్పుకోవాల్సింది ఏమంటే వ్యాయామానికి ఒక ధ్యేయం ఉంటుంది. ఏం కావాలనుకుంటున్నాం–ఏం సాధించాలనుకుంటున్నాం అనేదానిమీద ఎక్సర్‌సైజ్ ప్రోగ్రాంలు వుంటాయి. వైవిధ్యభరితంగా ఇన్ని ఆటలు, క్రీడలు, వ్యాయామాలు ఉండగా యోగా ఎందుకు? దాని వల్ల ఒనగూరే ప్రయోజనం ఏముందీ? అనేది సీరియస్‌గా ఆలోచిస్తే విషయం అర్థమవుతుంది. చదువుల్లో కూడా అంతే కదా? మనం ఏం కావాలనుకుంటున్నామో, దాన్ని బట్టే కోర్సులుంటాయి. డాక్టర్ అశోక్ రాజ్ గోపాల్ మోకాలి చిప్ప మార్పిడి చేసే ప్రత్యేక నిపుణుడు. ఆయన చెప్పిన విషయాల్ని 'ద డెయిలీ టెలిగ్రాఫ్' ప్రకటించింది. న్యూ ఢిల్లీకి చెందిన డీన్ నెల్సన్ కూడా కొన్ని వివరాలు అందించాడు. ఈ భారతీయ వైద్య నిపుణులు ఇచ్చిన వివరాలను, వివరణలను బట్టి మనం తెలుసుకోగలిగేది ఏమంటే–చాలా మంది యోగా గురువులు మోకాలి చిప్ప మార్పిడి కోసం సర్జరీ చేయించుకున్నవారే! ఇంకా చాలామంది ఇప్పటికీ సర్జరీ లైన్లో నిలబడుతున్నవారే. 'థండర్ బోల్ట్' అనే వజ్రాసనం వేసేవారికి ఈ మోకాలి చిప్ప ఆపరేషన్‌లు తప్పనిసరి అవుతున్నాయి. ఇంతకూ వజ్రాసనం ఎలా వేస్తారు? అంటే మోకాళ్ళు రెండూ వెనక్కి మడిచి, మడిమెల మీద కూర్చుంటారు. దాని వల్ల మోకాళ్ళు ఒత్తిడికి గురై నాడులూ, జాయింట్లు దెబ్బతింటాయి. ఫలితంగానే యోగా గురువులు, వారి శిష్యులూ కలసికట్టుగా సర్జరీలు చేయించుకోవాల్సి వస్తోంది. మరో ముఖ్య విషయమేమంటే ఈ యోగా గురువులు ఎవరికీ మానవ శరీర నిర్మాణానికి సంబంధించిన అవగాహన ఏమాత్రం ఉండదు. ఇష్టం వచ్చినట్టుగా కాళ్ళూ, చేతులూ, మెడ, భుజాలు వంచి విచిత్రమైన భంగిమలలో జనాన్ని ఆకర్షిస్తుంటారు. యోగా వల్ల కీళ్ళ నొప్పులు వస్తాయని, ముందే నొప్పులు ఉన్నవారికి అవి అధికమౌతాయనీ ఆర్థోపెడిక్ డాక్టర్లు వివరణ ఇస్తున్నారు. వెన్నెముకను విల్లులా వెనకకు వంచడం వల్ల అనేక అనర్థాలున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. మనిషి వెన్నెముక ముందుకు వంగడానికి అనువుగా నిర్మాణమై ఉంది. మరి అందుకు విరుద్ధంగా వెనకకు వంచడమంటే రిస్కు తీసుకోవడమే కదా? మనిషనే జెండాను ఎగరేస్తున్నట్టు మనిషి వెన్నెముక జెండా కర్రలాగా, భూమికి 90 డిగ్రీల కోణంలో నిలబడి ఉంటుంది. అంటే భూమ్యాకర్షణ శక్తిని ఎదుర్కొంటూ వెన్నెముక మనిషిని నిలబెడుతుంది. అలాంటి ముఖ్యమైన భాగాన్ని ఇష్టం వచ్చినట్టు వంచడం అనేది తెలివైన పని కాదు. బాల్యం నుండే ఆసనాలు అభ్యాసం చేసేవారి విషయం వేరు. మధ్య వయస్సులో, వృద్ధాప్యంలో ప్రారంభించేవారు సమస్యలు ఎదుర్కోక తప్పదు. ప్రాణాయామంలో గట్టిగా శ్వాసపీల్చి, వదిలేయాల్సిన గాలిని, అంటే కార్బన్ డై ఆక్సైడ్‌ను వదిలివేయకుండా ఎక్కువ సేపు ఊపిరితిత్తుల్లో బలవంతంగా ఆపడం జరుగుతుంది. అది మంచిది కాదని నిపుణులు చెప్తారు. ఎక్కువ ఆక్సిజన్ పీల్చుకుంటే ఆరోగ్యం చేకూరుతుంది. కానీ కార్బన్ డై ఆక్సైడ్ సత్వరం వదిలేయాల్సిన వాయువు. శరీరంలోని జీవన క్రియల్ని నిర్వర్తించడానికి మొత్తానికి మొత్తంగా శారీరక ధర్మాల్ని పర్యవేక్షించడానికి మెదుడుకు ఎక్కువ రక్తం అవసరమౌతుంది. శరీరానికి అందే ఆక్సిజన్‌లో 20 శాతం మెదడే ఉపయోగించుకుంటుంది. యోగా చేసేప్పుడు మెదడుకు తగినంత ఆక్సిజన్ అందదు. అందుకే మెదడు స్తబ్దుగా అయిపోయి, భ్రమలు కలగడం ప్రారంభమౌతాయి. అలాగే సుష్టుగా భోజనం ముగించాక చూడండి ఒళ్ళంతా బరువుగా, బద్ధకంగా, స్తబ్దుగా ఉంటుంది. అలా ఎందుకూ అంటే–జీర్ణాశయం నిండిన ఆహారాన్ని జీర్ణం చేయడానికి ఎక్కువ మొత్తంలో రక్తం జీర్ణ వ్యవస్థకు చేరుతుంది. ఫలితంగా మెదడుకు ఆక్సిజన్, రక్తప్రసరణ తాత్కాలికంగా తగ్గుతాయి. కాలో, చెయ్యో తిమ్మిరెక్కడం అలాంటిదే–రక్త ప్రసరణలో అంతరాయమే– యోగ, ధ్యానం చేయడం వల్ల, సమాధిలోకి పోవడం వల్ల జరుగుతున్నదీ అదే! ఆలోచనల్ని అరికట్టి, మెదడును మొద్దుబారించి, భ్రమల్లోకి, కల్పనల్లోకి పోవడమే!'శ్వాస మీద ధ్యాస' అని చెపుతారు కొందరు. అంటే ఏమిటీ? కళ్ళు మూసుకుని, శ్వాస మీద ధ్యాస పెట్టి ఇష్ట దైవాన్ని తలచుకోవడం. అట్లా అట్లా భ్రమల్ని ఊహల్ని పెంచి పోషించుకుని దైవ దర్శనమయ్యిందని సంతృప్తిని పొందవచ్చు. ఈ ఐహిక బంధాల్లోంచి బయటపడి ఒక స్థాయికి ఎదిగి తపస్సు చేస్తే–ఆధ్యాత్మిక శక్తిని సాధించగలమని సాధువులు చుప్తుంటారు.

# జి7 సదస్సులో భారత్ కీలక ప్రతిపాదనలు



కెనడా,కెనడాలోని కనానస్కిస్‌లో 2025 జూన్ 18 -19 తేదీలలో జరిగిన 51వ జి-7 సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఔట్‌రీచ్ సెషన్‌లో పాల్గొని, ఉగ్రవాదం, ఇంధన భద్రత, కృత్రిమ మేధస్సు (ఎఐ), గ్లోబల్ సౌత్ ఆకాంక్షలపై కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ సమావేశం ప్రపంచ శాంతి, స్థిరమైన అభివృద్ధి కోసం సమష్టి చర్యల అవసరాన్ని నొక్కి చెప్పింది. మోడీ ప్రసంగం భారత్‌ను గ్లోబల్ సౌత్ దేశాల ప్రతినిధిగా నిలబెట్టడమే కాక, ఉగ్రవాద నిర్మూలన, స్థిరమైన ఇంధన విధానాలపై దృఢమైన సందేశాన్ని అందించింది. ఈ సమ్మిట్‌లో చర్చించిన అంశాలు, భారత్ ప్రతిపాదనలు, ఇతర దేశాల స్పందనలు ప్రపంచ రాజకీయ, ఆర్థిక డైనమిక్స్‌ను అర్థం చేసుకోవడానికి కీలకమైనవి. జి-7 సదస్సులో ఉగ్రవాదం ప్రధాన అంశంగా నిలిచింది. పహల్గాం ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ మోడీ దీనిని మానవత్వంపై దాడిగా అభివర్ణించారు.'ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరి ఉండకూడదు. దీనిని సమర్థించే దేశాలు తగిన మూల్యం చెల్లించాలి' అని ఆయన హెచ్చరించారు. పాకిస్తాన్‌ను పరోక్షంగా ఉగ్రవాద కేంద్రంగా ఆరోపిస్తూ, దాని వత్తాసుతోనే పహల్గాం దాడి జరిగిందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాద నిర్మూలనకు అంతర్జాతీయ సమన్వయం, ఆర్థిక ఆంక్షలు, సమాచార భాగస్వామ్యం అవసరమని సూచించారు. ఈ వ్యాఖ్యలు పాకిస్తాన్‌పై ఒత్తిడి తీసుకురావడంతో పాటు, భారత్ జాతీయ భద్రతా విధానాన్ని ప్రపంచ వేదికపై స్పష్టం చేశాయి. ఇంధన భద్రత మరో కీలక చర్చా అంశం. మోడీ స్థిరమైన, సరసమైన ఇంధన వనరుల అవసరాన్ని నొక్కి చెప్పారు. గ్లోబల్ సౌత్ దేశాలు ఇంధన అనిశ్చితులను ఎదుర్కొంటున్నాయని, సౌర, పవనశక్తి వంటి పునరుత్పాదక వనరులపై పెట్టుబడులు పెంచాలని సూచించారు. భారత్‌లో సౌరశక్తి, గ్రీన్‌హైడ్రోజన్ వంటి చొరవలను హైలైట్ చేస్తూ, అంతర్జాతీయ సహకారం కోసం పిలుపునిచ్చారు.ఎఐ సాంకేతికత శక్తివంతమైనది అయినప్పటికీ, దాని అధిక ఇంధన వినియోగం సవాలని, దీనికి పరిష్కారంగా గ్రీన్ డేటా సెంటర్ల అభివృద్ధిని ప్రతిపాదించారు.ఈ సూచనలు భవిష్యత్–కేంద్రిత దృష్టిని, భారత్ పర్యావరణ నిబద్ధతను ప్రతిబింబించాయి. గ్లోబల్ సౌత్ దేశాల ఆకాంక్షలను మోడీ బలంగా వినిపించారు. ఆర్థిక అసమానతలు, సాంకేతిక వెనుకబాటుతనం, ఇంధన అవసరాలు వంటి సమస్యలను లేవనెత్తి, ఈ దేశాలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ఎఐ ఆవిష్కరణలలో సమన్యాయం, సాంకేతిక బదిలీ ద్వారా గ్లోబల్ సౌత్ దేశాల సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ఈ ప్రతిపాదనలు భారత్‌ను అభివృద్ధి చెందుతున్న దేశాల స్వరంగా నిలబెట్టాయి. జి-7 దేశాల నాయకుల స్పందన సానుకూలంగా ఉంది. కెనడ ప్రధాని మార్క్ కార్నీ మోడీని ఆహ్వానించడం వెనుక భారత్ పెరుగుతున్న ఆర్థిక, రాజకీయ ప్రభావాన్ని గుర్తించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన ద్వైపాక్షిక చర్చలలో పహల్గాం దాడికి ప్రతిగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరిగినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు ఉగ్రవాద నిర్మూలనకు ఐక్యత అవసరమని సమర్థించాయి. అయితే ఆంక్షల విధానంపై ఏకాభిప్రాయం సాధించడం సవాలుగా కనిపిస్తోంది. ఇంధన భద్రత, ఎఐపై భారత్ సూచనలు గ్లోబల్ సౌత్ దేశాల నుండి విశేష ఆదరణ పొందాయి. జి -7 దేశాలు సహకారం కోసం ముందడుగు వేసే సూచనలు కనిపించాయి. విశ్లేషణాత్మకంగా చూస్తే మోడీ జి-7 సమ్మిట్‌లో భారత్ జాతీయ ప్రయోజనాలను, గ్లోబల్ సౌత్ ఆకాంక్షలను సమతుల్యం చేసే ప్రయత్నం చేశారు. ఉగ్రవాదంపై దృఢమైన వైఖరి, పాకిస్తాన్‌పై విమర్శలు అంతర్జాతీయ సంఘంలో భారత్ గళాన్ని బలోపేతం చేశాయి.ఇంధన భద్రత, ఎఐపై సూచనలు భవిష్యత్ -కేంద్రిత దృష్టిని సూచిస్తాయి. అయితే, ఈ ప్రతిపాదనల అమలుకు అంతర్జాతీయ సమన్వయం, రాజకీయ సంకల్పం అవసరం. జి-7 దేశాల సానుకూల స్పందన ఉన్నప్పటికీ ఆంక్షలు, సాంకేతిక బదిలీ వంటి విషయాలలో ఏకాభిప్రాయం సాధించడం సవాలుగా ఉంది. ఈ సమ్మిట్ భారత్ గ్లోబల్ లీడర్‌షిప్‌ను బలపరిచింది. ఉగ్రవాద నిర్మూలన, స్థిరమైన ఇంధనం, ఎఐ అభివృద్ధిలో భారత్ చూపిన చొరవలు ప్రపంచ శాంతి, అభివృద్ధికి దోహద పడతాయి. గ్లోబల్ సౌత్ దేశాల స్వరంగా, భారత్ ప్రతిపాదనలు సమతుల్య ప్రపంచీకరణకు మార్గం సుగమం చేస్తాయి. ఈ సమ్మిట్ ఫలితాలు భవిష్యత్ అంతర్జాతీయ సహకారానికి దిశానిర్దేశం చేస్తాయని ఆశిద్దాం.

# పొలిటికల్ ట్యాపింగ్‌లో అధికార గణం!



న్యూఢిల్లీ,అత్యధిక ప్రజామోదంతో అధికారం చేపట్టిన రాజకీయ పక్షాలు కూడా తమ ఇష్టానుసారంగా రాజ్యం చేయలేవు. అయితే అధికారంలో ఉన్నప్పుడు కొంతమందికి అవేమీ గుర్తు రావు, మేము ఏం చేసినా చెల్లిపోతుంది అనుకుంటూ ఉంటారు. ప్రస్తుతం తెలంగాణలో వరుసగా రెండుసార్లు ప్రజామోదం పొంది అధికారంలోకి వచ్చి మూడవసారి ఓటమి చవిచూసి ప్రతిపక్షంలో కూర్చున్న భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) అధినాయకత్వం అట్లాగే ఆలోచించిందని జరుగుతున్న పరిణామాలు చూస్తే మనకు అర్థం అవుతుంది. సరే ప్రభుత్వాలు మారగానే ఆ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో చేసిన పనుల్లో జరిగిన అవకతవకలు, అక్రమాల మీద దర్యాప్తులు జరగడం, కేసులు రావడం అనేది ఇటీవల కాలంలో చాలా సాధారణమైపోవడం మనకు తెలిసిందే.అటువంటి ఒకానొక అక్రమ చర్య భారత రాష్ట్ర సమితి రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించి ఓడిపోయేదాకా కొనసాగించింది అని ఆరోపణలు వచ్చాయి. దానిమీద ప్రస్తుత ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం జరుపుతున్న విచారణలో నిర్ఘాంతపరిచే వాస్తవాలు అనేకం బయటకు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుదీర్ఘ పోరాటం జరిపి లక్ష్యాన్ని సాధించుకుని వరుసగా తొలి పదేళ్లు అధికారంలో ప్రజామోదంతో కొనసాగిన భారత రాష్ట్ర సమితికి తలవంపులు తెచ్చే వ్యవహారం ఇది. 2018లో రెండవసారి అత్యధిక మెజారిటీ సాధించి 119 స్థానాలకు గాను 81 స్థానాలు గెలుచుకొని రెండవసారి అధికారం చేపట్టాక రాష్ట్రంలో మళ్లీ 2023లో ఎన్నికలు జరిగే వరకు దాదాపు 600 మందిపైన ప్రభుత్వ నిఘా కొనసాగిందని అందుకు సంబంధించిన వివరాలు ఇప్పుడు బయటపడుతున్నాయి.రాష్ట్రంలో నేరాలని పరిశోధించడానికి, అసలు నేరాలే జరగకుండా చూడటానికి,వాటిని అరికట్టడానికి, శాంతిభద్రతలను పరిరక్షించడానికి ఉద్దేశించి పని చేయవలసిన పోలీస్ వ్యవస్థను అధికారపక్షం తన ప్రత్యర్థుల కదలికలు, వారు జరిపే సంభాషణలు తెలుసుకోవడం కోసం దుర్వినియోగపరిచిందని ప్రత్యేక దర్యాప్తు బృందం జరుపుతున్న విచారణలో బయటపడుతున్నది. 1885 భారత టెలిగ్రాఫిక్ చట్టంలోని సెక్షన్ 5(2) ప్రకారం ఒక అనుమానిత వ్యక్తి టెలిఫోన్ సంభాషణలు కనుక టాప్ చేయాలనుకుంటే హోం మంత్రిత్వ శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఫోన్ ట్యాపింగ్ అనేది వ్యక్తుల వ్యక్తిగత గోప్యత (ప్రైవసీ)కు భంగం కలిగించేది కాబట్టి అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఈ చర్యకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఏమిటా అసాధారణ పరిస్థితులు అంటే సదరు వ్యక్తులు దేశభద్రతకు ముప్పు కలిగించే వ్యవహారాలూ చేస్తున్నా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు చేస్తున్నా వాటిని పరిగణనలోకి తీసుకోవచ్చు.తెలంగాణలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉండగా అప్పటి ప్రభుత్వం ఇవేమీ పట్టించుకున్నట్లు లేదు. ఎడాపెడా అనేకమంది టెలిఫోన్ సంభాషణలను ట్యాప్ చేసి నట్టు వివరాలు బయటకు వస్తున్నాయి. ఇట్లా ట్యాప్ చేసిన ఫోన్లలో ప్రత్యర్థి రాజకీయ నాయకులే కాకుండా ఇతర రంగాలకు సంబంధించిన పలువురు, చివరకు జర్నలిస్టులు, న్యాయమూర్తులు కూడా ఉన్నట్టు తెలుస్తున్నది. వీళ్ళంతా ఏ విధంగా దేశభద్రతకు ముప్పు కలిగిస్తారో, ఏ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ప్రమాదం ఉందో ఈ వ్యవహారం నడిపిన వాళ్ళే చెప్పాలి. రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేయడానికి లేదా తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే కుట్రను ఛేదించడానికి అప్పుడు అధికారంలో ఉన్నవారు ఈ ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు చెప్తున్నారు. అప్పుడు అధికారాల్లో ఉన్న పక్షం అటువంటిది ఏమీ జరగలేదని పదేపదే చెబుతున్నా రెండు ఉదాహరణలు తమంతట తామే దానిని అంగీకరించినట్టు స్పష్టం చేస్తున్నాయి.ఇటీవల మాజీ శాసనసభ్యుడు గోనే ప్రకాష్ రావు ఒక దగ్గర చెప్పినట్టు కొద్దిమంది టిఆర్ఎస్ శాసన సభ్యులను కొనుగోలు చేసేందుకు హైదరాబాద్ శివారులోని ఒక ఫారం హౌస్‌లో కుట్ర జరిగిందనే ఆధారాలు చూపడం కోసం ఆనాటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు బయటపెట్టిన ఆడియోలే ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నడానికి ఒక ఉదాహరణ. మరొకటి టిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఆ పార్టీలో ముఖ్యుడు, కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా పనిచేసిన వి. ప్రకాష్ ఒక యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రభుత్వంలోని ఒక ముఖ్యుడు తన ఫోన్ ట్యాప్ అవుతున్నదని, ఎవరూ తనకు ఫోన్ చేయవద్దని సూచించినట్టుగా చెప్పారు. రాజకీయాల్లో ఉన్నవాళ్ళు తమ నీడను చూసి కూడా అప్పుడప్పుడు దడుచుకుంటారేమో అనుకోడానికి ఈ టెలిఫోన్ ట్యాపింగ్ ఉదంతం మంచి ఉదాహరణ. మాజీ ముఖ్యమంత్రి రక్త సంబంధీకులను కూడా నక్సల్ సంబంధాల పేరుతో ట్యాపింగ్ చేయించడం అందుకు గొప్ప ఉదాహరణ.ఈ ఉదాహరణలు సరిపోతాయి ఫోన్ ట్యాపింగ్ జరిగింది అనడానికి. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తు జరుపుతున్న ప్రత్యేక బృందం సేకరించిన ఆధారాల్లో పలువురు ప్రత్యర్థి రాజకీయ ప్రముఖులు, ఇతర రంగాల ప్రముఖులు కూడా ఉన్నారు. అటువంటి వారందరినీ సాక్ష్యం కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం తమ ముందు హాజరు కావలసిందిగా నోటీసులు పంపుతుండటం చూస్తున్నాం. నోటీసులు అందుకున్న ప్రముఖులలో పార్లమెంట్ సభ్యులు, ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా ఉండడం విశేషం. 2013లో కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్న భారతీయ జనతా పార్టీ నాయకుడు అరుణ్ జైట్లీ ఫిర్యాదు మేరకు పార్లమెంట్ ఏర్పాటు చేసిన హోం శాఖ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రజాప్రతినిధుల మీద ఇటువంటి ఫోన్ ట్యాపింగ్ అవసరం అయినప్పుడు పార్లమెంట్ సభ్యులు అయితే లోక్‌సభ స్పీకర్ అనుమతి, శాసన సభ్యులైతే శాసన సభాధ్యక్షుడు అనుమతి తప్పనిసరిగా తీసుకుని కానీ చేయడానికి వీలు లేదు. ఇది ఆనాటి పార్లమెంటు ఆమోదం కూడా పొందినట్టు గుర్తు.ఇటువంటి పద్ధతులూ, నిబంధనలు ఏవీ పాటించకుండా తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టుగా అర్థమవుతున్నది. ఇప్పటికే దాదాపు నలుగురు పోలీస్ అధికారులు ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో జ్యూడిషియల్ రిమాండ్‌లో గడిపి బెయిల్ మీద వచ్చి ఉన్నారు. మరొక అధికారి ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ముఖ్యపాత్ర ఉందని చెప్తున్న అప్పటి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో అధిపతి ప్రభాకరరావు కొంతకాలం అమెరికాలో ఉండి సుప్రీం కోర్టు కల్పించిన వెసులుబాటు కారణంగా ప్రస్తుతం అరెస్టు తప్పించుకొని ప్రత్యేక దర్యాప్తు బృందం ముందు హాజరవుతున్నారు. దర్యాప్తులో ఆయన సహకరించడం లేదు కాబట్టి ఇచ్చిన ఆగస్టు అయిదు వరకు ఆయనను అరెస్ట్ చెయ్యరాదంటూ ఇచ్చిన వెసులుబాటును రద్దుచేసి పోలీసు కస్టడీలోకి తీసుకోవడానికి అనుమతించవలసిందిగా సుప్రీం కోర్టును కోరడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం యోచిస్తున్నది .ఆయన ప్రత్యేక దర్యాప్తు బృందంతో సహకరించకపోగా,తాను డ్యూటీ మాత్రమే చేశాను అని చెప్తున్నారు. అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలు ఆదేశించినంత మాత్రాన చట్టవ్యతిరేకమైన, అనైతికమైన వ్యవహారాలు చక్కబెట్టడం తన డ్యూటీలో భాగం కాదన్న విషయం ఈ ఉన్నతాధికారికి ఎందుకు జ్ఞాపకం రాలేదో అర్థం కాదు. ఇక్కడ ఒక విషయం మాట్లాడుకోవాలి. ఒకసారి మొత్తం వ్యవహారాన్ని గురించి ఆలోచిద్దాం. ఆనాటి ముఖ్యమంత్రి తన రాజకీయ ప్రత్యర్థులు లేదా తన అధికారానికి ఇబ్బంది కలిగించే వాళ్లు అనుకున్న వారి కదలికల మీద నిఘా వేయడం కోసం ఈ పోలీస్ వ్యవస్థను ఉపయోగించు కున్నారని అనుకుందాం. రేపు అంతిమంగా నష్టపోయేది ఎవరు? అన్ని రకాలుగా తమ కెరియర్ పరంగా, నైతికంగా కూడా నష్టం జరిగేది ఎవరికి? రాజకీయ నాయకత్వం చెప్పిన పని అనైతికం అనే విషయం గుర్తు చేయకుండా, ఇది చేయకూడదు అని చెప్పకుండా తలలు ఊపి వారి మెప్పు పొందడం కోసం చేసిన పని కారణంగా వాళ్ళు ఎంత నష్టపోతున్నారు అర్థం అవుతున్నది.ఎక్కడా లిఖితపూర్వక ఆదేశాలు లేకుండా వాటిని అమలు పరిచిన వారంతా అన్ని విధాలుగా నష్టపోవడం తప్ప ఈ కేసు చివర్లో సాధించేది ఏమి ఉండదు. రాజకీయ పార్టీలను ప్రజలు ఐదేళ్లకు ఒకసారి ఎన్నుకుంటారు. నచ్చకపోతే మార్చుకుంటారు. అధికార యంత్రాంగం, ఉద్యోగులు మూడు నాలుగు దశాబ్దాలు ప్రజాధనం జీతాలుగా తీసుకుంటూ ప్రజాసేవ చేయడం కోసం నియమితులవుతారు. అంతేకాదు ఎప్పటికప్పుడు అధికారంలో ఉండే రాజకీయ నాయకత్వాన్ని అప్రమత్తం చేసి సరైన మార్గంలో పెట్టవలసిన బాధ్యత అధికార యంత్రాంగానిది. దురదృష్టవశాత్తె రాజకీయపక్షాల కంటే ఎక్కువ లేదా ఆ పక్షాలతో సమానంగా పోటీ పడుతూ అప్రతిష్టపాలు కావడానికి అధికార

# కొనసాగుతున్న ఆపరేషన్ సింధు

న్యూఢిల్లీ, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతుండటంతో ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' కొనసాగుతోంది. ఇందులో భాగంగా మరో ప్రత్యేక విమానం ట్రెహ్రాన్ నుంచి శనివారం సాయంత్రం న్యూఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సురక్షితంగా చేరుకుంది. ఇందులో 310 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ వారి కుటుంబ సభ్యులు, అధికారులు సాదర స్వాగతం పలికారు. దీంతో 827 మంది భారతీయులను ఇప్పటివరకూ సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినట్టు కేంద్ర విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. యుద్ధం, ఉద్రిక్తతల నడుమ తమకు సురక్షితంగా తీసుకువచ్చిన భారత ప్రభుత్వానికి విమానాశ్రయానికి చేరుకున్న విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఇరాన్ నుంచి తమను తరలించేటప్పుడు చక్కటి వసతి, లంచ్, డిన్నర్ వంటివన్నీ సకాలంలో అందించారని, తిరిగి స్వదేశానికి రావడం సంతోషంగా ఉందని అల్మాస్ రిజ్వి అనే స్టూడెంట్ తెలిపారు. ఇండియన్ ఎంబసీ ఎంతో సాయం చేసిందని, బారత ప్రభుత్వం తమపట్ల చాలా శ్రద్ధ తీసుకుందని చెప్పారు. ÷ూగా, ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా ఈనెల 20వ తేదీన ఇరాన్ నుంచి 290 మంది విద్యార్థులు ఢిల్లీకి చేరుకున్నారు. ఇరాన్ ప్రభుత్వం భారతీయుల కోసం గగనతలాన్ని తెరవడంతో పాటు అక్కడి నుంచి విమానాల ద్వారా సుమారు వెయ్యి మంది భారతీయులను తరలించేందుకు అనుమతించింది. దీనికి ముందు జూన్ 19న 110 మంది భారతీయ విద్యార్థులు అర్మేనియా, దోహా మీదుగా ఢిల్లీకి చేరుకున్నారు.

# కాంగ్రెస్‌లో కొండంత గొడవ..

హైదరాబాద్,కొండా కుటుంబం. కొండా సురేఖ, కొండా మురళి. తెలంగాణలో ఫైర్ బ్రాండ్ కపుల్స్. ఇద్దరూ ఇద్దరే. మాస్ లీడర్స్. మాస్ డైలాగ్స్. మాటలు తూటాల్లా ఉంటాయ్. చేతలు చురకత్తుల్లా దిగుతాయ్. అందుకే ఏకంగా కొండా సినిమా తీశారు. మొదటి నుంచి కాంగ్రెస్ రక్తమే. ఆ తర్వాత వైఎస్ కుటుంబానికి వీర విధేయులు. మధ్యలో కారెక్కినా.. మళ్లీ కాంగ్రెస్‌లో బలమైన నేతలుగా ఉన్నారు. వాళ్ల రాజకీయం వేరే లెవెల్. ప్రోటోకాల్స్, పద్దతులు గట్రా ఉండవు. తమకు నచ్చింది నచ్చినట్టు చేసుకుపోవడమే. నోటికి వచ్చినట్టు మాట్లాడటమే. అందుకే, మంత్రి కొండా సురేఖ చేసిన పలు కామెంట్స్ ఇటీవల కాలంలో తీవ్ర కలకలం రేపాయి. లేటెస్ట్‌గా కొండా మురళీ మాట్లాడిన మాటలు.. కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టింది.

కాంట్రవర్సీ కొండా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా దంపతులదే హవా. కొత్తగా వాళ్ల కూతురు సుస్మితా పటేల్ సైతం రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. జిల్లా మొత్తం తమదే అంటారు. అన్ని నియోజకవర్గాల్లో వేలు పెడుతుంటారు. మిగతా నేతలతో అంతగా కలవరు. గొడవలూ చాలానే ఉన్నాయి. మేము మోనార్క్. అదే కొండా స్టైల్. ఇలా వారిపై రకరకాల ఆరోపణలు ఉన్నాయి. కొండా కుటుంబంలో ముగ్గురికి మూడు ఎమ్మెల్యే టికెట్లు కావాలంటారు. గత ఎన్నికల్లో ఆ డీల్ కుదరకపోవడంతో వరంగల్ తూర్పులోనే పోటీ చేసి గెలిచారు సురేఖ. వచ్చే ఎన్నికల్లోనైనా పరకాల నియోజకవర్గంలో కూతురు సుస్మితా పటేల్‌ను బరిలో దించాలనేది వాళ్ల టార్గెట్. అందుకే, సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో గిల్లికజ్జాలు పెరిగాయి.

అందరికీ ఒకేసారి ఇచ్చిపడేశారు..

రేవూరిని 75 ఏళ్ల ముసలోడు అంటూ కొండా మురళి బహిరంగంగా కామెంట్స్ చేయడం కాంట్రవర్సీగా మారింది. మరో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కనుబొమ్మలు లేనోడని.. వర్ధన్నపేట ఎమ్మెల్యే, మాజీ పోలీస్ ఆఫీసర్ నాగరాజును ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అని.. వాళ్లంతా దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలంటూ.. సొంత పార్టీ నేతలపైనే తీవ్ర విమర్శలు చేయడం కాంగ్రెస్ పార్టీని షేక్ చేసింది. సురేఖ మంత్రి పదవికి ఢోకా లేదని.. తాము ఒక్క రూపాయి కూడా లంచం తీసుకోవడం లేదని.. తానే సురేఖకు నెలకు రూ.5 లక్షలు పంపిస్తున్నానంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ కూడా చేశారు. తనకు రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీలే అండా దండా అని చెప్పారు.

కొండా తగ్గేదేలే.. వాళ్లు వదిలేదేలే..

కొండా దెబ్బకు.. ఆయన వ్యతిరేక వర్గమంతా ఏకమయ్యారు. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నాయకత్వంలో భవిష్యత్ కార్యచరణ రెడీ చేశారు. కొండాకు యాంటీగా ఉన్న లీడర్స్ అంతా మీటింగ్‌కు రావడం ఆసక్తికరం. నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, నాగరాజు, బస్వరాజు సారయ్య, గుండు సుధారాణి, ఎర్రబెల్లి స్వర్ణ.. ఇలా బాధితులంతా కలిసి చర్చించుకున్నారు. ఈసారి కొండాను వదిలేదేలేదంటూ తాడోపేడో తేల్చుకునేందుకు సై అన్నారు. కొండా జంట.. జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో వర్గాలను పెంచి పోషించి చిచ్చు పెడుతున్నారని వారంతా కాంగ్రెస్‌లో అంతేనా?కొండా మురళి వ్యాఖ్యలు తన దృష్టికి వచ్చాయంటూ.. ఇరు వర్గాల నుంచి కంప్లైంట్స్ వచ్చాయని చెప్పారు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్. ఫిర్యాదులు పరిశీలించిన తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అయితే, కాంగ్రెస్‌లో ఇలాంటివన్నీ కామన్. కొండా లాంటి బలమైన నాయకుడిపై అంత ఈజీగా చర్యలు తీసుకునే అవకాశం లేదని అంటున్నారు పార్టీ శ్రేణులు.

# కలర్ బుక్ ప్రభుత్వాలేనా?

హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. గతంలో రాజకీయంగా ప్రత్యర్థులుగా మాత్రమే ఉండే రాజకీయనాయకుల మధ్య ఇప్పుడు శత్రుత్వమే కాదు.. వ్యక్తిగత కక్షల వరకు పరిస్థితులు వెళ్లిపోయాయి. అందుకు తగ్గట్లే విమర్శలు.. ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. లోకేశ్ షురూ చేసిన రెడ్ బుక్ రాజకీయం ఇప్పుడు అంతకంతకూ విస్తరిస్తోంది.లోకేశ్ నోటి నుంచి తరచూ వచ్చే రెడ్ బుక్ పాలన.. తెలుగు రాజకీయాల్లో సరికొత్త ఆయుధంగా మారింది. దీనికున్న క్రేజ్ ను పరిగణలోకి తీసుకున్న తెలంగాణ విపక్షం బీఆర్ఎస్ ముఖ్యనేతలు సైతం తాము పింక్ బుక్ రాస్తున్నట్లుగా పేర్కొంటున్నారు. మొదట్లో మాట వరసకు అన్నట్లుగా భావించినా.. రోజులు గడుస్తున్న కొద్దీ.. గులాబీ కీలక నేతల నోటి నుంచి తరచూ పింక్ బుక్ ప్రస్తావన రావటంతో.. తెలంగాణ రాజకీయాలు సైతం కలర్ బుక్ రాజకీయాల దిశగా అడుగులు పడుతున్నట్లుగా చెప్పాలి.ఇంతకూ ఈ బుక్ లో ఏముంటుంది? నిజంగానే అందులో ఏం రాసుకుంటారు? అన్న సందేహాలకు తావు లేకుండా విపక్షంలో ఉన్నప్పుడు లోకేశ్ తన వెంట రెడ్ కలర్ అట్ట ఉన్న పుస్తకాన్ని తన వెంట తీసుకొచ్చి.. సభలో మాట్లాడుతున్నప్పుడు కూడా ఆ పుస్తకాన్ని చూపించేవారు. నిజానికి లోకేశ్ ఇమేజ్ బిల్డింగ్ కు రెడ్ బుక్ కాన్సెప్టు కలిసి వచ్చిందని చెప్పాలి. ఆయన చేసిన సుదీర్ఘ పాదయాత్ర కంటే కూడా రెడ్ బుక్ పట్టుకొని.. "ప్రత్యర్థుల సంగతి తేలుస్తా.. అందులో అన్ని రాసుకుంటున్నా.. నా పార్టీకి చెందిన వారి ఇబ్బందుల్ని నమోదు చేసుకుంటా. అంతకంతకూ బదులు తీర్చుకుంటా' అంటూ చెప్పిన మాటలు హైలెట్ అయ్యాయి.లోకేశ్ రెడ్ బుక్ ఆయనకు కొత్త ఇమేజ్ తీసుకురావటమే కాదు.. నేతలు.. కార్యకర్తల్లో నమ్మకాన్ని పెంచేలా చేయటం మిగిలిన పార్టీలకు స్ఫూర్తిగా మారింది.

## సింగరేణి ఆధ్వర్యంలో సంప్ స్టోరేజ్ పవర్ ప్లాంట్

హైదరాబాద్, వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా ఇప్పటికే థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పిన సింగరేణి సంస్థ మరో వినూత్న విద్యుత్ ఉత్పాదన ప్లాంట్ ఏర్పాటుకు రంగంలోకి దిగింది. సింగరేణి సంస్థ అప్పగించిన బాధ్యతల ప్రకారం వ్యాప్కోస్ లిమిటెడ్ సంస్థ మేడిపల్లి ఓపెన్ కాస్ట్ సంపు ఆధారంగా 500 మెగావాట్ల పంపుడు స్టోరేజ్ ప్రాజెక్ట్‌ని నిర్మించడానికి సంబంధించిన పూర్తి అధ్యయనం చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో రామగుండం-1 ఏరియాలో మూతబడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని వాటర్ సంపు ఆధారంగా పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రాథమిక అధ్యయనాలు పూర్తిచేసిన కంపెనీ సంపూర్ణ ప్రాజెక్ట్ రిపోర్ట్ రూపొందించడానికి వ్యాప్కోస్ లిమిటెడ్ అనే ప్రభుత్వ రంగ సంస్థకు బాధ్యతలను అప్పగిస్తూ లెటర్ ఆఫ్ అవార్డును అందజేసినట్లు సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఈ తరహా ప్రాజెక్ట్ ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో ఎవరూ చేపట్టలేదని సింగరేణి సంస్థ దీనిని ప్రయోగాత్మకంగా చేపట్టడమే కాక విజయవంతంగా నిర్వహిస్తోందన్న నమ్మకం తమకు ఉందని అన్నారు. ఈ ఎ÷-లాంటును ఏర్పాటు చేయనున్న మేడిపల్లి ఓపెన్ కాస్ట్ సంపును, నిర్మాణ ప్రాంతాన్ని ఇప్పటికే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖా మాత్యులు మల్లు భట్టి విక్రమార్క సందర్శించారని, ఈ వినూత్న ప్రాజెక్టును చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. జియోలాజికల్, జియోటెక్నికల్, హైడ్రాలజీ అధ్యయనాలతో పాటు సివిల్ డిజైన్లు, ఉత్పత్తి సామర్థ్య అంశాలు మెకానికల్, ఎలక్ట్రికల్ డిజైన్లు, పర్యావరణ సంబంధ అంశాలు, రక్షణ చర్యలు వంటి విషయాలపై సమగ్ర అధ్యయనాన్ని జరిపి డీపీఆర్‌ను రూపొందించాల్సి ఉంటుంది. ఎ÷-లాంట్ నిర్మాణానికి పట్టే సమయం, నిర్మాణపు ఖర్చు, ప్లాంట్ పూర్తయిన తర్వాత ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్తు అమ్మకాలకు గల అవకాశాలు తదితర అనేక విషయాలను డీపీఆర్‌లో పొందుపరచనున్నారు. ప్రస్తుతం మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనిలో సుమారు 157 మీటర్ల లోతున భారీ నీటి సంపు ఏర్పడి ఏడాది పొడుగునా భారీ పరిమాణంలో నీరు నిల్వ ఉంటుంది. ఈ నీటిని ఉపరితలంపై నిర్మించనున్న దాదాపు ఇదే పరిమాణం గల మరో భారీ నీటి రిజర్వాయర్ లోకి పగటిపూట సోలార్ విద్యుత్ ద్వారా పంపింగ్ జరుపుతారు. ఈ విధంగా పగటిపూట నింపిన నీటిని భారీ పైపుల గుండా రాత్రివేళ కిందికి పంపిస్తూ ఆ జల శక్తితో, మధ్యలో ఏర్పాటు చేసిన టర్బైన్లను తిప్పడంతో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. కింద ఉన్న నీటిని పైకి పంపిణీ చేసి, అలా అక్కడ నిలువ చేసిన నీటిని కిందికి పంపి విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. ఇలా చేయడాన్ని పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ అని పిలుస్తారు. మూతబడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనిలో గల భారీ నీటి సంపు, ఉపరితలంలో రిజర్వాయర్ నిర్మించడానికి ఖాళీ ప్రదేశ లభ్యతలు ఇక్కడ ఉండటంతో సింగరేణి మొత్తంలో ఈ ప్రాజెక్ట్‌ని ఇక్కడే ఏర్పాటు చేయాలని ప్రాథమిక అంచనాకు వచ్చారు. ప్రాజెక్ట్ వ్యయం సుమారు రూ.3000 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా. అయినప్పటికీ 40 ఏళ్ల పాటు 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ పంప్డ్ స్టోరేజీ ఎ÷-లాంటు సింగరేణికి గట్టి ఆర్థిక పరిపుష్టిని కలిగిస్తుంది. వ్యాప్కోస్ లిమిటెడ్ సంస్థ డీపీఆర్ సిద్ధం చేయగానే నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పిలిచే అవకాశం ఉంది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఛైర్మన్, ఎండీ ఎన్. బలరామ్‌తో పాటు డైరెక్టర్ ఈ అండ్ ఎండీ. సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్వీ.సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ఎ÷-లానింగ్ కే. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్డీఎం సుభాని, జనరల్ మేనేజర్ సీపీపీ ఏ.మనోహర్, జనరల్ మేనేజర్గ ÷నాన్స్ అండ్ అకౌంట్స్ ఎం. సుబ్బారావు, ఇంకా వివిధ విభాగాల కార్పొరేట్ జనరల్ మేనేజర్లు, ఏరియా, సంబంధిత జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు

## విరుచుకు పడుతున్న ఇజ్రాయిల్

టెహ్రాన్,ఇరాన్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడులతో విరుచుకుపడుతోంది. ఈ దాడుల్లో ఇప్పటికే పలువురు కీలక నేతలు, అణు శాస్త్రవేత్తలను కోల్పోయిన ఇరాన్ తాజాగా మరో ముగ్గురు టాప్ కమాండర్లను కోల్పోయింది. దీంతో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కు గట్టి దెబ్బ తగిలింది. ఈ దాడుల్లో మృతి చెందిన కమాండర్లలో ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ ఆయుధ సరఫరా విభాగం కమాండర్ బెహ్నామ్ షాహ్రియారీ కూడా ఉన్నట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటించింది. ఇజ్రాయెల్ సరిహద్దు నుంచి 1,000 కిలోమీటర్ల దూరంలోని పశ్చిమ ఇరాన్‌లో బెహ్నామ్ షాహ్రియారీ నడుపుతున్న వాహనంపై బాంబు దాడి జరపడంతో అతను హతమైనట్టు ఐడీఎఫ్ ధ్రువీకరించింది. ప్రాక్సీలకు ఇరాన్ ఆయుధాల స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను పర్యవేక్షించడంలో ఇతను కీలకవ్యక్తిగా ఉన్నట్టు తెలిపింది. లెబనాన్‌లో హెజ్‌బుల్లా, గాజాలో హమాస్, యెమెన్‌లో హౌతీ మిలీటియాకు నేరుగా ఆయుధాల సరఫరాలో ఇతని ప్రమేయం ఉంది. ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణల్లో ఇజ్రాయెల్ పౌరులు, సైనిక బలగాలపై ప్రయోగించిన రాకెట్లు, క్షిపణులను సరఫరా చేయడంలో సాహ్రియారీ పాత్ర కీలకమని ఐడీఎఫ్ తెలిపింది. కాగా, ఇజ్రాయెల్ శనివారం ఉదయం జరిపిన మరో దాడిలో ఖుద్స్ ఫోర్స్ పాలస్తీనా డివిజన్ హెచ్ సయీద్ ఇజాదీ మరణించాడు. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న మమాస్ మారణహోమానికి పాల్పడడానికి ముందు ఈ ఘటనకు ఎ÷-లానింగ్, వనరుల సరఫరా వంటివి ఇజాదీ చేసినట్టు ఐడీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. శనివారంనాడే ఇరాన్‌కు చెందిన మరో కమాండర్ అమిన్ పౌర్ జోడకీ కూడా హతమైనట్టు పేర్కొంది. ఐఆర్జీసీ సెకెండ్ డ్రోన్ యూనిట్‌కు ఇతను డిప్యూటీ కమాండర్‌గా ఉన్నట్టు తెలిపింది. ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఈ దాడులు చేపడుతోంది.

## హామీ మేరకు రైతుభరోసా నిధులు విడుదల

హైదరాబాద్,రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధుల జమ కొనసాగుతోంది. ఇచ్చిన హామీ మేరకు నిధలును జమ చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ముందుంటుందని అన్నారు. అన్నదాతలకు సకాలంలో వ్యవసాయ పెట్టుబడి అందేలా చేస్తున్నామని అన్నారు. శనివారం 9 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. ఆరు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7,770.83 కోట్లు జమ చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భారాస హయాంలో రైతుబంధు నిధుల విడుదల నెలలపాటు సాగేదని విమర్శించారు. 'మేం వేగంగా రైతు భరోసా ఇస్తుంటే భారాస నేతలు డ్రామాలు చేస్తున్నారు. ఓఆర్ఆర్ లోపల సాగు భూములను గుర్తించి వాటికీ రైతు భరోసా ఇస్తాం. పంట సాగయ్యే ప్రతి భూమికి రైతు భరోసా చెల్లిస్తాం. కోతల ప్రభుత్వమనే భారాస పార్టీని ప్రజలు తిరస్కరించారు. భారాస ప్రభుత్వం రుణమాఫీని ఎన్నేళ్లలో చేసిందో గుర్తు చేసుకోవాలి' అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

# ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం



టెహ్రాన్:ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ సంఘర్షణ కేవలం రెండు దేశాల మధ్య మాత్రమే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, భద్రత, వాణిజ్యంపై గణనీయమైన దుష్పరిణామాలను కలిగి ఉంది. ఈ యుద్ధం కేవలం తాజా ఘర్షణల పర్యవసానం కాదు, ఇది అనేక దశాబ్దాలుగా పాతుకుపోయిన రాజకీయ, మతపరమైన, వ్యూహాత్మక విభేదాల ఫలితం. ఈ రెండు దేశాలు భౌగోళికంగా పక్కపక్కన లేనప్పటికీ, వాటి మధ్య వైరం పశ్చిమ ఆసియా భౌగోళిక రాజకీయాలకు కీలకమైనది. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం భారత ఆర్థిక వ్యవస్థపై అనేక విధాలుగా ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగా, భారత్ ఇంధన అవసరాల కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడి ఉన్నందున ఈ యుద్ధం కీలక పరిణామాలకు దారితీస్తుంది. భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 85% దిగుమతులపై ఆధారపడి ఉంది. హోర్ముజ్ జలసంధిలో రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా భారతదేశంలో ముడి చమురు ధరలు భారీగా పెరుగుతాయి. చమురు ధరలు పెరిగితే, పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్(ఎటిఎఫ్) వంటి ఇంధన ధరలు కూడా పెరుగుతాయి. ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. దిగుమతి బిల్లు పెరిగి, రూపాయి విలువ బలహీనపడే అవకాశం ఉంది. ఇంధన ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు పెరుగుతాయి. ఇది నిత్యావసర వస్తువులతో సహా అన్ని వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుంది. దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. ఇది సాధారణ ప్రజల కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది. ఇజ్రాయెల్‌కు ఆసియాలో భారతదేశం రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. బాస్మతి బియ్యం, వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు వంటి వస్తువులను భారత్ ఇజ్రాయెల్‌కు ఎగుమతి చేస్తుంది. యుద్ధం వాణిజ్యాన్ని ప్రభావితం చేస్తుంది. మధ్యప్రాచ్య దేశాలకు భారతదేశం చేసే ఎగుమతుల కోసం బీమా ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఇది భారతీయ ఎగుమతిదారులను ప్రభావితం చేస్తుంది. ఎర్ర సముద్రం గుండా వాణిజ్య మార్గాల్లో అంతరాయం ఏర్పడితే, షిప్పింగ్ ఖర్చులు, డెలివరీ సమయాలు పెరుగుతాయి. ఇది అంతర్జాతీయ సరఫరా గొలుసులను దెబ్బతీస్తుంది. మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ అనిశ్చితి పెరిగే కొద్దీ, ప్రపంచ స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు పెరుగుతాయి. భారతీయ స్టాక్ మార్కెట్లు కూడా దీనికి మినహాయింపు కాదు. పెట్టుబడిదారులు అనిశ్చితి సమయంలో బంగారం వంటి 'సురక్షిత ఆశ్రయం' ఆస్తులలో పెట్టుబడులు పెడతారు. ఇది స్టాక్ మార్కెట్ల నుండి నిధులను మళ్లిస్తుంది. అనిశ్చితి పరిస్థితు లలో విదేశీ పెట్టుబడిదారులు భారత్ నుండి తమ పెట్టుబడులను ఉపసం హరించుకోవచ్చు. మధ్యప్రాచ్యంలో ఉన్న భారతీయ కార్మికుల భద్రత, వారి స్వదేశానికి తిరిగి వచ్చే అవకాశం కూడా ఒక ఆందోళన కలిగించే అంశం. భారత్‌కు ఇజ్రాయెల్, ఇరాన్ రెండింటితోనూ మంచి సంబం ధాలు ఉన్నాయి. ఇజ్రాయెల్‌తో రక్షణ, సాంకేతిక, వ్యవసాయ రంగాలలో సహకారం ఉంది. ఇరాన్ నుండి గతంలో పెద్ద ఎత్తున చమురును దిగుమతి చేసుకునేది, ఆంక్షలు ఉన్నప్పటికీ వారితో సంబంధాలను కొనసాగిస్తోంది. ఈ పరిస్థితులలో ఏ వైపు మొగ్గు చూపినా దౌత్యపరమైన సవాళ్లు ఎదురవుతాయి. ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం పశ్చిమ ఆసియాకు తీవ్ర అస్థిరత, ఆర్థిక సంక్షోభం, మానవతా సవాళ్లను తెచ్చిపెడుతుంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో, నియంత్రించడంలో అమెరికా పాత్ర కీలకమైనది. అయితే అది ఇజ్రాయెల్ భద్రతకు తన నిబద్ధతను, ప్రాంతీయ స్థిరత్వాన్ని కొనసాగించాల్సిన అవసరం మధ్య సమతుల్యతను సాధించాల్సి ఉంటుంది. అదే సమయంలో ఈ యుద్ధం భారతదేశానికి ఆర్థికంగా గణనీయమైన సవాళ్లను ఎదుర్కొనేలా చేస్తుంది. ఇంధనభద్రత, ద్రవ్యోల్బణ నియంత్రణ, వాణిజ్య మార్గాల భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంటుంది.

# ఆటిజంపై జన్యువుల ప్రభావం



సెంట్రల్ డెస్క్:ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అనేది మెదడు అభివృద్ధిలో తేడాల వల్ల కలిగే ఒక రుగ్మత. దీనిని సాధారణంగా మందబుద్ధి అని అంటారు. ఈ రుగ్మత ఉన్న వ్యక్తులు తోటివారితో కలసిమెలసి ఉండకుండా ఒంటరిగా ఉంటుంటారు. తల్లి కడుపులో బిడ్డ ఉన్నప్పటి దశలోనే ఈ ఆటిజం లక్షణాలు సంక్రమిస్తుంటాయి. శిశువు మెదడులో నాడీ కణాల ఉత్పత్తి, వీటి మధ్య సమాచార ప్రసారంలో లోపాలు ఆటిజంకు కారణమవుతున్నాయి. ఆటిజం బారిన పడినవారు సామాజిక సంబంధాలు, ప్రవర్తన, కమ్యూనికేషన్‌లో సమస్యలను ఎదుర్కొంటుంటారు. సామాజిక సూచనలను అర్థం చేసుకోలేరు. ఒకే పనిని పదేపదే చేయడం, కొన్ని వస్తువుల పైనే ఎక్కువ ఆసక్తి చూపడం, కదలికల్లో ఇబ్బంది ఇవన్నీ ఆటిజం లక్షణాలు.శబ్దాలు, వెలుతురు, తాకిడికి భరించలేని సున్నితత్వం. మాట్లాడడం, నడవడం లేదా ఇతర ముఖ్యమైన నైపుణ్యాలు నేర్చుకోవడంలో ఆలస్యం చేస్తుంటారు. ఇటీవల పరిశోధనలో జన్యుపరమైన అంశాలు, పర్యావరణ అంశాలు సంయుక్తంగా ఆటిజంపై ప్రభావం చూపిస్తుంటాయని వెల్లడైంది. ఈ లక్షణాలకు మూలకారణమైన జన్యువులు ఏమిటో తెలుసుకోడానికి పరిశోధనలు చేపట్టగా వాయు కాలుష్యం వంటి పర్యావరణ అంశాలు, తల్లి ఆరోగ్యం ఇవన్నీ జన్యువులతో అనుసంధానమవుతాయని తేలింది. ఆటిస్టిక్ లక్షణాలున్న వారికి, ఆ లక్షణాలు లేనివారికి మెదడు అభివృద్ధిలో తేడాలు కనిపిస్తున్నట్టు పరిశోధకులు తెలుసుకున్నారు.కొన్ని అధ్యయనాలు ఆటిజం బాధితుల్లో మెదడు విపరీతంగా పెరగడం, కార్టికల్ వ్యత్యాసాలను కనుగొన్నాయి. కార్టికల్ వ్యత్యాసాలు అంటే పట్టకట్టు వ్యత్యాసాలు లేదా వల్కల వ్యత్యాసాలు అని చెప్పవచ్చు. ఇది మెదడు బయటిపొర (కార్టెక్స్)లోని నిర్మాణంలో లేదా మందంలో ఉండే తేడాలను సూచిస్తుంది. ఈ వ్యత్యాసాలు, ప్రవర్తన, అభిజ్ఞ సామర్థ్యాలలో తేడాలకు దారితీస్తుంది. కొత్త జన్యువులు, జన్యువుల్లో భేదాలు, అరుదైన ఉత్పరివర్తనాలు, సాధారణ మార్పులు ఆటిజం లక్షణాలతో అనుసంధానమవుతాయని పరిశోధకులు గుర్తించారు. అలాగే నిర్దిష్టమైన ప్రొటీన్లు ఆటిజంతో కలిసి మెదడులోని ఇతర మాలిక్యూల్స్‌తో అనుసంధానమవుతాయని తెలుసుకున్నారు. ఉదాహరణకు జన్యుమార్పు వల్ల సంక్రమించే మైయోటోనిక్ డిస్ట్రోఫీ (డిఎం1)కూడా మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపించి ఆటిజం వంటి లక్షణాలకు దారితీస్తుంది.మయోటోనిక్ డిస్ట్రోఫీ అంటే వారసత్వంగా వచ్చే రుగ్మత. ఇది కండరాల క్షీణత, బలహీనతకు కారణమవుతుంది. దీనినే కండరాల క్షీణత వ్యాధి అని అంటారు. ఆటిజంపై వాయు కాలుష్యం వంటి పర్యావరణ ప్రభావాలపై, గర్భస్రావ సమయంలో తల్లి ఆరోగ్యం ప్రభావంపై కూడా పరిశోధనలు జరిగాయి. దీనివల్ల ఆటిజం రిస్కు ఎక్కువవుతుందని తేలింది. గర్భిణిపై అత్యధిక స్థాయిల వాయు కాలుష్యం ప్రభావం చూపిస్తుందని తేలింది. ముఖ్యంగా మూడో నెల గర్భిణిపై వాయుకాలుష్య ప్రభావం తీవ్రంగా ఉంటే పుట్టిన బిడ్డకు ఆ తరువాత ఆటిజం లక్షణాలు బయటపడతాయని పరిశోధకులు చెబుతున్నారు. ఆటిజం ఉన్న వ్యక్తుల్లో మెదడు అభివృద్ధిలో కార్టికల్ దళసరి, విపరీతంగా పెరగడం, మెదడు నెట్‌వర్క్‌లో తేడాలు కనిపించాయి. ఆటిజం లేని వారితో పోలిస్తే ఆటిజం ఉన్న బాలికల్లో మూడేళ్ల వయసులో మెదడులోని కార్టెక్స్ చాలా దళసరిగా ఉండడం కనిపించింది.ఆటిజం ఉన్న మహిళల్లో వారి బాల్యంలోనే కార్టికల్ సన్నబడడం వేగంగా ఉంటోందని పరిశోధకులు గుర్తించారు. శస్త్ర చికిత్సల అవసరం లేకుండా మెదడును చైతన్యపర్చడం, ప్రెజర్ చాంబర్ థెరపీ అంటే హైపర్‌బారిక్ ఆక్సిజన్ థెరపీ (శుద్ధియైన ఆక్సిజన్‌ను ఒత్తిడిగదిలో పీలుస్తుండడంతో రక్తంలో ఆక్సిజన్ శాతాన్ని పెంపొందించడం) వంటి నూతన చికిత్సలను, ఆవిష్కరణ పద్ధతులను పరిశోధకులు ఇప్పుడు ముందుకు తెస్తున్నారు. బిడ్డ దశలోనే ఆటిజం లక్షణాలను కనుగొనడానికి ఎం చాట్ ఆర్/ఎఫ్ వంటి సమర్థవంతమైన స్క్రీనింగ్ పరికరాలను అధ్యయనంలో ప్రవేశపెట్టారు. ఆటిజం పెరగడానికి జన్యువులు, పర్యావరణ అంశాల మధ్య సమస్యలతో కూడిన పరస్పర చర్యలు ముడిపడి ఉన్నాయని పరిశోధన వెల్లడించింది. ఆటిజం పూర్తిగా నయమయ్యేది కాకపోయినా, తగిన సమయంలో చికిత్స అందిస్తే ఆటిజం పిల్లలు మామూలుగా ఎదిగే అవకాశం కలుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 42 మంది పిల్లల్లో ఒకరికి ఆటిజం సంక్రమిస్తోందని సర్వేలు చెబుతుండగా మన దేశంలో ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరు దీని బారినపడుతున్నారని ఇండియన్ జర్నల్ ఆఫ్ పీడియాట్రిక్స్ పత్రికలో అధ్యయనం వెలువడింది. ఆటిజం ఎందుకు వస్తుందో ఏయే అంశాలు దోహదం చేస్తున్నాయో ప్రపంచ వ్యాప్తంగా అధ్యయనాలు సాగుతున్నాయి. పుట్టిన తర్వాత రెండేళ్ల వయసులో పాత నాడీ కణాలకు బదులుగా కొత్త కణాలు వచ్చి చేరేటప్పుడు క్రమపద్ధతి లేకపోవడం కూడా కారణం కావచ్చునని భావిస్తున్నారు. అయితే ఆటిజంలో జన్యు, పర్యావరణ అంశాల ప్రభావమే ఎక్కువ అని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. 700 కంటే ఎక్కువ జన్యువులు ఆటిజంతో సంబంధం కలిగి ఉన్నాయి. క్రోమోజోమల్ మైక్రోఅరే, తర్వాతి తరం సీక్వెన్సింగ్ వంటి జన్యు పరీక్షలను ఉపయోగించి జన్యుపరమైన కారణాలను నిర్ధారించవచ్చు.ఇది ప్రారంభ చికిత్సలోనే వ్యాధి భవిష్యత్‌ను అంచనా వేయడంలో సాయపడుతుంది. ఆటిజం జన్యుపరమైన కారణాలను నిర్ధారించడానికి ప్రస్తుతం ఎన్నో పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అబ్బాయిలకి ఫ్రెగైల్ అండ్ టెస్టింగ్ సిఫార్సు చేస్తుంటారు. కొంతమంది అమ్మాయిల్లో ఎంఇసిపి2 జన్యువుల్లో మార్పులను ఆ జన్యు పరీక్ష గుర్తించ గలుగుతుంది. ఆటిజంకు కారణమయ్యే జన్యువులను తొలగించడం, నకిలీలను గుర్తించడం వంటి చర్యలను క్రోమోజోమల్ మైక్రోఅరే పరీక్షలు చేపడతాయి. పసిపిల్లల్లో ఆటిజంను ముందుగా గుర్తించడానికి ఎంచాట్, త్రివేంద్రం ఆటిజం బిహేవియరల్ చెక్‌లిస్ట్ సోషల్ కమ్యూనికేషన్ క్వశ్చనేర్ వంటి స్క్రీనింగ్ సాధనాలను వాడవచ్చు. డిఎస్ఎం 5 వంటి మార్గదర్శకాలు, ఆటిజం డయాగ్రోస్టిక్ అబ్జర్వేషన్ షెడ్యూల్, ఇండియన్ స్కేల్ ఫర్ ది అసెస్‌మెంట్ ఆఫ్ ఆటిజం వంటి సాధనాలు సమస్యను గుర్తించడానికి ఉపయోగఎడతాయి.

# ఆషాఢ బోనాలకు రంగం సిద్ధం

హైదరాబాద్, ఆషాడ జాతర వచ్చేస్తుంది. గోల్కొంబోనాలతో ఆషాఢ బోనాల జాతర ఆరంభం కానుంది. అమ్మవారిని తమ ఇంటి బిడ్డగా భావించి అత్త ఇంటి నుంచి పుట్టింటికి తీసుకువచ్చి ఎంతో అందంగా అలంకరించి ధూప నైవేద్యాలతో సారే తో తిరిగి అత్తింటి వారికి పంపించేటటువంటి సాంప్రదాయమే ఈ బోనాల పండుగ.

అంతేకాకుండా వర్షాలు పడేటటువంటి ప్రారంభం. దీంతో పంటలు బాగా పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకునేటటువంటి పండుగ కూడా.. అలాంటి బోనాల పండుగ అతి దగ్గరలోనే ఉంది. ఆషాడ మాసంలోని తొలి ఆదివారం లేదా తొలి గురువారం గోల్కొండ లోని జగదాంబిక ఆలయంలో నిర్వహించే ఉత్సవాలతో బోనాలు మొదలవుతాయి. అప్పటి నుంచి నెల రోజుల పాటు జరిగేటటువంటి ఈ పండుగ ఎన్నో విశేషాలతో కొనసాగుతుంది. ఈ ఏడాది జూన్ 26 నుంచి జూలై 26 వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. జూన్ 26న గోల్కొండ బోనాలు ఉత్సవాలతో ప్రారంభమవుతాయి. జూన్ 29న విజయవాడ కనకదుర్గమ్మకు బోనం సమర్పిస్తారు. జూలై 13న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఉంటుంది. ఆ తర్వాత రోజు జులై 14న రంగం భవిష్యవాణి.. జులై 20న భాగ్యనగర లాల్ దర్వాజా బోనాల జాతర ఉంటుంది. జులై 21న ఉమ్మడి దేవాలయాల ఘట్టాల ఊరేగింపు నిర్వహించనున్నారు. 24న బోనాల ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ఉంటాయి.నెల రోజులు పాటు జరిగేటటువంటి బోనాలలో భక్తులు రద్దీ నెలకొంటుంది. దేశ విదేశాల నుంచి బోనాల జాతరను చూసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తారు. ఈ విధంగా ఆషాడ మాసం అనగానే హైదరాబాదులో జరిగే బోనాలు జాతరే గుర్తుకొస్తుంది. ఈసారి ఈ బోనాల జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు కూడా సన్నద్ధమవుతున్నారు.

## పర్యావరణహిత నగరాభివృద్ధికి కృషి

హైదరాబాద్,సొంతింటి కలను సాకారం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమైందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఇల్లు కొనేందుకు రుణాలిచ్చే ముందు అన్ని విధాలా సరి చూసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ వాల్యుయర్స్, రిజిస్టర్డ్ వాల్యుయర్స్ ఫౌండేషన్, ఎక్షు హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ట్రాన్స్‌ఫర్మేటివ్ ఎరాలో వాల్యుయేషన్' అంశంపై జరిగిన జాతీయ సదస్సులో రంగనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.సుస్థిర వ్యాపారానికి హైడ్రా దోహదం చేస్తోందని అందరూ గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి మోసాలకు ఆస్కారం లేకుండా సొంతింటి కలను సాకారం చేయడంలో రియల్ ఎస్టేట్ సంస్థలతో పాటు, ఆ ఇంటికి రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలు కూడా బాధ్యత వహించాలని రంగనాథ్ సూచించారు.గతేడాది జులై 19న హైడ్రా ఏర్పడిందని.. అంతకుముందు వెలసిన నివాస ప్రాంతాలతో పాటు, అనుమతులు పొంది నిర్మాణ దశలో ఉన్న వాటి జోలికి వెళ్లబోమని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పాటైన తర్వాత నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తామన్నారు. హైడ్రా అంటే కూల్చివేతలు కాదు.. పర్యావరణ హితమైన నగరాభివృద్ధికి దోహదం చేసే సంస్థగా అందరూ గుర్తిస్తున్నారని వివరించారు. సర్వే నంబర్ ఒకటి చూపించి.. వేరే చోట ఇళ్ల నిర్మాణం చేపడుతున్నవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్థిక సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలకు ఆస్తి విలువలను నిర్ణయించడంలో పారదర్శకత, నమ్మకం, కచ్చితత్వాన్ని నిర్ధరించడంలో వాల్యుయేషన్ నిపుణుల పాత్ర చాలా కీలకమైందన్నారు. స్థిరాస్తుల విలువ నిర్ధరించడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత ఉపయోగంగా ఉన్నా.. క్షేత్రస్థాయి పరిశీలన కూడా అంతే ముఖ్యమన్నారు. గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించి.. వరద ముప్పులేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలనేది హైడ్రా లక్ష్యమని రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే చెరువులు, నాలాలు, పార్కులు, రహదారుల ఆక్రమణలను నిరోధించి.. ప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడేందుకు హైడ్రా ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఓఆర్ఆర్ పరిధిలో వెయ్యికి పైగా ఉన్న చెరువుల పునరుద్ధరణ జరిగి.. పార్కులన్నీ పచ్చగా ఉన్నప్పుడు పర్యావరణ సమతుల్యత సాధించగలుగుతామన్నారు.

## షిల్లాంగ్‌లోని జిల్లా షెషన్స్ కోర్టు ఆదేశం

షిల్లాంగ్,హనీమూన్‌కు వెళ్లి హత్యకు గురైన రాజా రఘువంశీ కేసులో ఆయన భార్య, కీలక నిందితురాలు సోనమ్ కి షిల్లాంగ్‌లోని జిల్లా షెషన్స్ కోర్టు 13 రోజుల జ్యుడిషయల్ కస్టడీకి ఆదేశించింది. ఆమెతో పాటు ఆమె బాయ్‌ఫ్రెండ్, మరో నిందితుడు రాజ్ కుష్వాహకు సైతం జ్యుడిషయల్ కస్టడీ విధించింది. హనీమూన్ ట్రిప్‌లో హత్యకు గురైన రాజ రఘువంశీ కేసు తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ హత్యతో ప్రమేయం ఉన్న సోనమ్, కుష్వాహ, మరో ముగ్గురిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు.కాగా, సోనమ్, రాజా కుష్వాహలను జ్యుడిషియల్ కస్టడీలోకి తీసుకోవాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తుషార్ చందా ఆదేశించారు. జ్యుడిషియల్ కస్టడీకి ఇవ్వాలని ఇన్వెస్టిగేటింగ్ అధికారి కోరగా, నిందితుల కస్టడీని పోలీసులు కోరలేదు. కాగా, ఎనిమిది రోజుల కస్టడీలో పోలీసు ఇన్వెస్టిగేటర్స్‌ను సోనమ్ తప్పుదారి పట్టించారని రాజా రఘువంశీ పెద్ద సోదరుడు సచిన్ రఘువంశీ ఇండోర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. కుట్ర పథకాన్ని పూర్తి స్థాయిలో వెలికి తీసేందుకు, నిందితులను మరింత లోతుగా ప్రశ్నించేందుకు పోలీసు రిమాండ్‌ను పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. కీలక సమాచారాన్ని సోనమ్ దాచిపెట్టిందని, మరింత సమగ్ర విచారణ కోసం నిందితులను ఇండోర్‌కు ట్రాన్స్‌ఫర్ చేయాలని అన్నారు. ఈ కుట్రలో సోనమ్ కుటుంబసభ్యులు, సన్నిహితుల ప్రమేయానికి అవకాశం ఉందని, వీరికి నార్కో టెస్టులు జరపాలని కోరారు. ఈ స్థాయిలో హత్యకు ఎ÷-లాన్ చేయడం అంత సులభం కాదని, ఆమెకు సన్నిహితంగా ఉన్న వారిని మరింత లోతుగా విచారించాలని అన్నారు. రాజా రఘువంశీ తల్లి ఉమా రఘువంశీ భావోద్వేగానికి గురయ్యారు. తన కొడుకును ఎందుకు చంపిందో సోనమ్ వివరణ ఇవ్వాలని, నిజం ఆమె నోట వెంట వినేంతవరకూ తనకు శాంతి లేదని అన్నారు. ఈ కేసులో ప్రమేయమున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టకుండా విచారణ జరపాలని దర్యాప్తు అధికారులను కోరారు. మే 11న వివాహం చేసుకున్న రాజా, సోనమ్ దంపతులు మే 20న హనీమూన్ ట్రిప్ కోసం మేఘాలయ వెళ్లారు. మే 23 నుంచి రాజా కనిపించకుండా పోయాడు. అయితే పదిరోజుల తర్వాత జూన్ 2న అతని మృతదేహం ఈస్ట్ కాశీ హిల్స్ జిల్లాలో కనిపించడం సంచలనమైంది. సోనమ్ తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి కిరాయి గూండాలతో ఈ హత్య చేయించినట్టు పోలీసు విచారణలో తేలింది.

## ఆందోళనకరంగా ఉద్యోగాల కల్పన

ముంబై,దేశంలో ఐటి ఉద్యోగాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పలు దిగ్గజ సంస్థలు ఉద్యోగులను ఉన్నపళంగా తొలగించడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. కొత్తగా ఉద్యోగాల కల్పన కూడా అంతంతమాత్రంగానే ఉంటోంది. పట్టాలు పుచ్చుకుని బయటకు వస్తున్న వారిలో చాలామంది ఉద్యోగాలు దొరక్క ఆందోళన చెందుతున్నారు. దేశీయ ఐటీ దిగ్గజ సంస్థలు ఆరేడు త్రైమాసికాలుగా వెల్లడిస్తున్న ఆర్థిక ఫలితాల్లో నికర ఉద్యోగుల సంఖ్య తగ్గడమే కానీ, పెరిగింది లేదు. అయితే తాజా జులై-సెప్టెంబరు ఫలితాల్లో మాత్రం ఇందుకు భిన్నంగా ఉద్యోగుల సంఖ్య పెరగడం, తాజా ఉత్తీర్ణుల ఎంపికలనూ ప్రణాళిక మేరకు చేపడుతున్నామని ఆయా యాజమాన్యాలు ప్రకటించడం.. ఉద్యోగార్థులకు భవిష్యత్తుపై ఆశలు చిగురింప చేశాయనే చెప్పాలి. వివిధ సంస్థల్లో ఉద్యోగుల క్షీణత గణనీయంగా పెరుగుతూ వచ్చింది. కృత్రిమమేధ ప్రాజెక్టుల్లోనూ ఆర్డర్లు వస్తున్నట్లు వెల్లడించడం, అధునాతన సాంకేతికతలపై మన నిపుణులకు ఉన్న సామర్థ్యాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థలు గుర్తించినట్లయ్యింది. కళాశాల ప్రాంగణాల్లో ఎంపిక చేసి, గతంలో ఆఫర్ లెటర్ ఇచ్చిన అందరినీ తప్పనిసరిగా చేర్చు కుంటున్నట్లు ఈ సంస్థలన్నీ ప్రకటించాయి. కానీ జీతాలు పెరిగే కొద్దీ కొత్తవారిని తీసుకుంటూ పాతవారిని తొలగిస్తున్నారు. దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని మోడీ అభివర్ణించారు. పేదలకు 3 కోట్ల కొత్త పక్కా గృహాలు ఇచ్చాం. రూ.9 లక్షల కోట్ల ఇన్ఫ్రా ప్రాజెక్టులపై పని మొదలైంది. 15 వందేభారత్ రైళ్లు ప్రారంభించాం. 8 కొత్త ఎయిర్ పోర్టుల పనికి శ్రీకారం చుట్టాం. యువతకు రూ.2లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చాం. రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లను బదిలీ చేశాం. 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత వైద్యానికి ఏర్పాట్లు చేశాం. 5 లక్షల ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశాం. స్టాక్‌మార్కెట్ సూచీల్లో దాదాపు 7 శాతం వృద్ధి నమోదైంది. విదేశీ మారకద్రవ్యం 700 బిలియన్ డాలర్లను దాటేసింది. అంటూ ప్రధాని ఎక్కడికి వెళ్లినా చెబుతున్నారు. ప్రపంచ భవిష్యత్తును భారత్ నిర్ణయిస్తుంది. మా ప్రభుత్వ మూడో విడత పాలనతో రేటింగ్ ఏజెన్సీలు దేశ వృద్ధిరేటును గణనీయంగా పెంచాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న దేశమని ప్రధాని మోదీ అభివర్ణించారు. పేదల కష్టాలు తమకు బాగా తెలుసన్నారు.

# ఈటెల రూట్ ఎటు...టార్గెట్ చేస్తున్నారుగా ?



హైదరాబాద్,బీజేపీలో నాలుగేళ్ళ క్రితం చేసిన తెలంగాణా సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి తెలంగాణా ఉద్యమంలో పాల్గొన్న ధీటైన పోరాటం చేసిన వారుగా ఈటెల రాజెందర్ కి ఎంతో పేరుంది. ఆయనది తెలంగాణా రాష్ట్ర రాజకీయాల్లో పాతికేళ్ల చరిత్ర. అనేక పర్యాయాలు ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అంతే కాదు మంత్రిగా కూడా వివిధ కీలక శాఖలకు పనిచేశారు కేసీఆర్ కి తలలో నాలుకగా ఆనాటి టీఆర్ఎస్ లో నంబర్ టూ గా వ్యవహరించేవారు. అయితే తరువాత కాలంలో కేసీఆర్ తో విభేదాలు రావడంతో పాటు పార్టీలో కేటీఆర్ ప్రాధాన్యత పెరగడంతో ఈటెలని మెల్లగా సైడ్ చేస్తూ వచ్చారన్నారన్న భావం ఆయన వర్గంలో కలిగింది. ఇక కారు పార్టీకి తామూ యజమానులమని ఆయన ప్రకటించిన తరువాత దారులు వేరయ్యాయి. ఒక ఫైన్ మార్నింగ్ ఆయనను పార్టీ దూరం పెట్టేసింది. ఆ సమయంలో విపక్షంలో కాంగ్రెస్ బీజేపీ రెండూ ఉన్నాయి. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలో చేరితేనే తెలంగాణాలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నుంచి రక్షణ ఉంటుందని భావించి కాంగ్రెస్ ఉంచి మంచి ఆహ్వానం ఉన్నా సరే ఈటెల కమలం తీర్థం పుచ్చుకున్నారు. ఇది వ్యూహాత్మకంగా తీసుకున్న నిర్ణయం అంటున్నారు. ఇక చూస్తే బీజేపీలో చేరినా ఈటెలకు అక్కడ సరైన ప్రాధాన్యత లేదని అంటున్నారు. బీజేపీలో మొదటి నుంచి ఉన్న బలమైన బీసీ నేత బండి సంజయ్ కే ప్రాముఖ్యత ఉంటూ వచ్చింది. ఇక ఆయన కేంద్ర మంత్రి కూడా అయ్యారు. బీజేపీలో ఎవరు చేరినా టికెట్ ఇచ్చి ఎంపీ ఎమ్మెల్యేలు చేస్తారు కానీ పదవుల విషయానికి వచ్చేసరికి మాత్రం పార్టీలో మొదటి నుంచి ఉన్న వారికే ప్రాధాన్యత ఇస్తారు అన్నది అందరికీ తెలిసిందే. దాంతోనే ఈటెల వర్గం కలత చెందుతోంది అంటున్నారు. లోక్ సభ ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన ఈటెలకు కచ్చితంగా కేంద్ర మంత్రి పదవి ఖాయమని అనుకున్నారు. అయితే అది దక్కలేదు. ఇక తెలంగాణా బీజేపీ అధ్యక్ష పదవి కూడా దక్కలేదు. దాంతో ఆయన వర్గం అసంతృప్తితో రగులుతోంది అని అంటున్నారు. దాంతోనే ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్ట్ మీద విచారణ కమిటీ వేస్తే దాని ముందుకు వెళ్ళిన ఈటెల కేసీఅర్ ని సమర్థిస్తూ మాట్లాడారు. కేసీఆర్ తప్పేమీ లేదని మీడియా ముఖంగానే చెప్పారు. దాంతో బీజేపీ నేతలు షాక్ తిన్నారు. ఈటెల ఎందుకిలా మాట్లాడుతున్నారు ఆయన మనసులో ఏముంది అన్నది కమలనాథులలో చర్చగా మారింది. ఇక లేటెస్ట్ గా చూస్తే కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈటెల మీద పరోక్ష విమర్శలు చేస్తూ గట్టి కౌంటర్ ఇచ్చారు. ఏవరైనా సరే కాళేశ్వరం ప్రాజెక్ట్ ని సమర్థించడం ముమ్మాటికీ తప్పు అని బండి హాట్ కామెంట్స్ చేశారు. బీజేపీలో ఉంటే పార్టీ స్టాండ్ మేరకే మాట్లాడాలని అంతే తప్ప వ్యక్తిగతాలు ఎవరికీ ఉండరాదని ఈటెలకు స్ట్రాంగ్ గానే చెప్పేశారు. కాళేశ్వరం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎం అని అవినీతి అక్రమాలలో కూడుకున్న ప్రాజెక్ట్ అది అని బండి సంజయ్ అన్నారు. అలాంటి కాళేశ్వరం ప్రాజెక్ట్ ని సమర్థించడం ఎంత మాత్రం మంచిది కాదని ఈటెలకు సూచించారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతితో పాటు ఫోన్ ట్యాపింగ్ మీద కూడా సీబీఐ విచారణకు ఆయన డిమాండ్ చేశారు. ఇవన్నీ పక్కన పెడితే ఈటెల పార్టీ స్టాండ్ కి యాంటీగా వెళ్తున్నారు అని బండి సంజయ్ చెప్పకనే చెప్పారా అన్న చర్చ సాగుతోంది. మరో వైపు చూస్తే ఈటెల బీఆర్ఎస్ నేతలకు మళ్ళీ టచ్ లోకి వచ్చారని గుసగుసలు గుప్పుమంటున్నాయి. ఈటెల బీఆర్ఎస్ లో తిరిగి చేరుతారని ఆయనను చేర్చుకోవడానికి కూడా బీఆర్ఎస్ అధినాయకత్వం సుముఖంగా ఉందని కూడా గాసిప్స్ పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. మరి ఈటెల రూట్ ఎటూ అన్న చర్చ ఒక వైపు సాగుతూంటే బీజేపీలో ఆయనను టార్గెట్ చేస్తున్నది ఎవరు అన్నది మరో చర్చగా ఉంది. ఏది ఏమైనా బలమైన బీసీ నేత ఈటెల కనుక స్ట్రాంగ్ డెసిషన్ తీసుకుంటే కనుక కచ్చితంగా అది బీజేపీకి దెబ్బ అని అంటున్నారు.

# అమరావతి ఎఫెక్ట్.. సజ్జలపై క్రిమినల్ కేసు!



అమరావతి,వైసీపీ కీలకనాయకుడు, ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ సజ్జల రామకృష్ణారెడ్డిపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బీఎన్ ఎస్ ఎస్ సెక్షన్లు 352,353(2), 196(1) కింద సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసినట్టు తాడేపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ ఖాజావలి తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు...ఆయనపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరు మండలానికి చెందిన మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ కంభం పాటి శిరీష ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్టు ఖాజావలి వివరించారు. ఉద్దేశ పూర్వకంగా ఒక సమూహాన్ని కించపరచడంతోపాటు సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన నేరంపై ఆయనపై కేసు పెట్టామన్నారు.

ఎందుకు?

రాజధాని అమరావతి ప్రాంతంపై సాక్షి మీడియా చానెల్ డిబేట్లో సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి. మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణంరాజును, సాక్షి యాంకర్ సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు.. సాక్షిమీడియా చైర్ పర్సన్, జగన్ సతీమణి భారతి తమకు క్షమాపణలు చెప్పాలని కోరారు. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాక్షి కార్యాలయాల వద్ద మహిళలు ఆందోళనలు చేశారు. సాక్షినేమ్ బోర్డులను తొలగించి.. పేపర్లను తగుల బెట్టారు. జగన్ సహా జర్నలిస్టుల చిత్ర పటాలను చెప్పులతో కొట్టారు. ఈ పరిణామాలపై స్పందించిన సజ్జల రామకృష్ణారెడ్డి అమరావతి మహిళలపై మరికొన్ని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాక్షసులు, దెయ్యాలు కూడా ఇలా చేయవని అన్నారు. "సంకర జాతి అయితేనే ఇలా చేస్తారు" అని సజ్జల వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు మరో దుమారానికి దారి తీశాయి. మహిళలను సంకర జాతితో పోల్చడంపై టీడీపీ సహా అన్ని పక్షాలు తీవ్రంగా విమర్శించాయి. ఈ క్రమంలోనే సజ్జలపై శిరీష ఫిర్యాదు చేశాయి. అయితే.. ఇది జరిగి వారం రోజులు అయిన తర్వాత.. న్యాయ నిపుణుల సలహాల మేరకు పోలీసులు కేసు నమోదు చేయడం గమనార్హం. అయితే. ఉన్నతాధికారుల సూచనల మేరకే తదుపరి చర్యలు ఉంటాయని వెల్లడించారు.

# ఏ2 జగన్, వైవీ, విడదల రజనీ కూడా నిందితులే..?



అమరావతి,రెంటపాళ్ల పర్యటన సందర్భంగా వాహనం కింద పడి చీలి సింగయ్య అనే వ్యక్తి మృతి కేసులో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై కేసు నమోదైంది. ఈ కేసులో ఆయనను రెండో నిందితుడు(ఏ2)గా పోలీసులు పేర్కొన్నారు. తాజాగా ఈ విషయాలను గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. అవును... రెంటపాళ్లలో వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా చీలి సింగయ్య అనే వ్యక్తి మృతిచెందిన విషయం తీవ్ర సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై గత వారం గుంటూరులోని నల్లపాడు పోలీస్ స్టేషన్ లో మృతుడు సింగయ్య భార్య లూర్ధుమేరీ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు బీ.ఎన్.ఎస్.లోని సెక్షన్ 106 (1) కింద కేసు నమోదు చేశారు. అయితే... తాజాగా వెలుగులోకి వచ్చిన వీడియో ఫుటేజీలలో.. జగన్ వాహనం కిందే పడి సింగయ్య మృతిచెందినట్లు వెల్లడవుతోందని అంటున్నారు! దీంతో... పోలీసులు ఈ కేసులో సెక్షన్లు మార్చారు. ఇందులో భాగంగా... బీ.ఎన్.ఎస్.లోని 49, 105 సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ సమయంలో... వాహనం నడిపిన జగన్ వెహికల్ డ్రైవర్ రమణారెడ్డిని ఈ కేసులో ఏ1గా చేర్చగా.. జగన్ ను ఏ2గా చేర్చారు. ఇక ఏ3గా జగన్ వ్యక్తిగత కార్యదర్శి కె నాగేశ్వరరెడ్డి, ఏ4గా వైవీ సుబ్బారెడ్డిని చేర్చారు. ఇదే సమయంలో మాజీ మంత్రులు పేర్ని నానిని ఏ5గా, విడదల రజనీని ఏ6గా, మరికొంతమందిని చేర్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గుంటూరు జిల్లా ఎస్పీ ఆదివారం రాత్రి మీడియాకు వివరించారు. ఇందులో భాగంగా... ఈ నెల 18న మాజీ సీఎం జగన్ తాడేపల్లి నుంచి రెంటపాళ్లలో విగ్రహావిష్కరణకు వెళ్లడానికి కాన్వాయ్ లోని 11 వాహనాలతో పాటు 3 వాహనాలకు అనుమతి ఇచ్చామని చెప్పారు. అయితే... ఆ నిబంధనలకు విరుద్ధంగా ఆయన తాడేపల్లి నుంచే 50 వాహనాల్లో బయల్దేరారని ఎస్పీ తెలిపారు. ఈ క్రమంలో కాన్వాయ్ నల్లపాడు స్టేషన్ పరిధిలోని ఏటుకూరు బైపాస్ ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు వచ్చిన సమయంలో.. సింగయ్యను జగన్ ప్రయాణిస్తున్న వాహనం ఢీకొందని.. గాయపడిన సింగయ్యను రోడ్డుపక్కన పడుకోబెట్టినట్లు సమాచారం రావడంతో 108లో ఆసుపత్రికి తరలించామని అన్నారు. అయితే.. అప్పటికే సింగయ్య మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని అన్నారు. దీంతో... సింగయ్య భార్య లూర్ధుమేరీ ఫిర్యాదు మేరకు 106(1) సెక్షన్ కింద కేసు నమోదు చేశామని చెప్పిన ఎస్పీ... దర్యాప్తులో భాగంగా ఆ రోజు జరిగిన ఘటనకు సంబంధించి వీడియో ఫుటేజీలు పరిశీలించడంతో పాటు ప్రత్యక్ష సాక్షులను విచారించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే... మాజీ సీఎం జగన్ వాహనం కింద సింగయ్య పడిపోవడం, చక్రం అతనిపై ఎక్కుతున్నట్లుగా వీడియో ఆధారం దొరికిందని వెల్లడించారు. ఈ సందర్భంగా లభించిన ఆధారాలను సాంకేతిక పరిజ్ఞానంతో పరిశీలించి కేసుకు అదనంగా సెక్షన్లు చేర్చినట్లు ఎస్పీ వివరించారు.

# ఓబీసీలను టార్గెట్ చేసిన రాహుల్



హైదరాబాద్,కాంగ్రెస్ అగ్ర నాయకుడు లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు అయిన రాహుల్ గాంధీ దేశంలోని ఓబీసీలను టార్గెట్ చేశారు. తొందరలో జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఇండియా కూటమి గెలుపు కోసం పదునైన వ్యూహాలను కాంగ్రెస్ రచిస్తోంది. అందులో భాగంగా ఓబీసీలను ఆకట్టుకోవాలని చూస్తోంది. కేవలం బీహార్ ఎన్నికల్లోనే కాకుండా దేశంలో పెద్ద శాతంగా ఉన్న ఓబీసీలను కాంగ్రెస్ వైపు తీసుకుని రావడం ద్వారా భారీ ఓటు బ్యాంక్ గా మార్చుకోవాలని యాక్షన్ ప్లాన్ ని రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరఫున త్వరలో కులగణన మీద ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఓబీసీ టీం ని కూడా ఎంపిక చేయనుంది అని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఓబీసీ సీనియర్ నేతల నుంచి ఈ కమిటీని ఏర్పాటు చేస్తారు అని అంటున్నారు. ఈ ప్రత్యేక బృందంలో 24 మంది దాకా ఓబీసీ నేతలు ఉంటారని చెబుతున్నారు. ఇక ప్రచారంలో ఉన్న దానిని బట్టి చూస్తే కనుక కర్ణాటక సీఎం కె.సిద్ధరామయ్య, మాజీ సీఎంలు అశోక్ గెహ్లాట్, ఎం.వీరప్ప మొయిలీ, భూపేశ్ బఘేల్, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు బీకే హరిప్రసాద్, సచిన్ పైలట్, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, గుజరాత్ విపక్ష నేత అమిత్ చవ్డా, ఏఐసీసీ నుంచి అజయ్ కుమార్ లల్లూ, జితేంద్ర బఘేల్ తదితరులు ఈ ప్రత్యేక బృందంలో ఉంటారని పేర్కొంటున్నారు. దేశంలో ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు వారి స్థితిగతులు వర్తమాన జీవన చిత్రం, వారి ఆకాంక్షలు, ప్రభుత్వాల నుంచి వారికి అందని సహాయం వంటి వాటిని పొందుపరుస్తూ ఓబీసీల మీద ఒక బ్లూ ప్రింట్ ని కూడా తయారు చేసే పనిలో కాంగ్రెస్ పార్టీ ఉందని అంటున్నారు. వీటిని తయారు చేసిన తరువాత ఈ సీనియర్ కూడిన ఓబీసీల ప్రత్యేక బృందం ద ఓబీసీలను అవగాహన కల్పిచడంతో పాటు వీలైనన్ని వేదికల మీద చర్చలకు అవకాశం ఇస్తుంది అలాగే చట్ట సభల లోపలా బయటా కూడా ఓబీసీల అంశాన్ని చర్చించనుంది. ఓబీసీలలో ప్రముఖ నేతలను రంగంలోకి దించడం ద్వారా కాంగ్రెస్ ఒక భారీ రాజకీయ ప్రయోగాన్నే చేస్తోంది అని అంటున్నారు. ఓబీసీ నేతలతో కూడిన కమిటీకి కన్వీనర్‌గా ఏఐసీసీ ఓబీసీ విభాగాధిపతి అనిల్ జైహింద్ వ్యవహరిఇస్తారని అంటున్నారు. అంతే కాదు ఓబీసీల మీద పూర్తి స్థాయిలో సమస్యలు లేవనెత్తుతూ వారిని పూర్తిగా తమ వైపు తిప్పుకునే ఆలోచనలో కాంగ్రెస్ ఉంది. అదే సమయంలో కులగణన మీద బీజేపీకి చిత్తశుద్ధి లేదని దేశానికి చాటనుంచి అని అంటున్నారు. బీజేపీ కేవలం బీహార్ తో పాటు మరికొన్ని ఎన్నికల కోసమే కులగణన అన్నది చేపట్టినట్లుగా ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. నిజానికి బీజేపీ 2024 లో అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపట్టి ఉంటే ఈపాటికి నివేదిక వచ్చి ఉండేదని అంటున్నారు. అలా కాకుండా 2027 మార్చి దాకా వ్యవధిని ఇవ్వడం ద్వారా ఆ పేరు చెప్పి యూపీతో సహా అనేక కీలక రాష్ట్రాలలో ఎన్నికలలో గెలవడమే ముఖ్య ఉద్దేశ్యంగా కనిపిస్తోంది అని అంటున్నారు. ఇక కులగణన మీద మొదట మాట్లాడిందే కాంగ్రెస్ అని ఆ పార్టీ పెద్దలు అంటున్నారు. ఆ విధంగా ఓబీసీల మద్దతుని దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో పోరాడుతోందని అందువల్ల ఓబీసీలతో పాటు అన్ని వర్గాల మద్దతు తమ పార్టీకే ఉంటుందని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. చూడాలి మరి ఓబీసీలను టార్గెట్ చేసిన కాంగ్రెస్ ఆశలు ఏ మేరకు నెరవేరుతాయో.

# బీఆర్ఎస్ కు ఇరిగేషన్ శాఖ అధికారులు టచ్ లో ఉన్నారా?




హైదరాబాద్,కేసీఆర్ సర్కారు చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు తప్పులపై రేవంత్ సర్కారు సీరియస్ గా ఉన్న సంగతి తెలిసిందే. అయితే.. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన ఇరిగేషన్ శాఖకు చెందిన కొందరు అధికారులు బీఆర్ఎస్ ముఖ్య నేతలతో టచ్ లో ఉన్నారా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. దీనికి కారణం లేకపోలేదు. రేవంత్ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంపైనా బీఆర్ఎస్ ముఖ్యనేతలకు సమాచారం వెను వెంటనే తెలిసిపోవటమే దీనికి కారణం. ఈ నేపథ్యంలో నీటిపారుల శాఖలో జరుగుతున్న పరిణామాలపై రేవంత్ సర్కారు ఫోకస్ చేసినట్లుగా చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఏసీబీ దాడులు కూడా ఇ ందులో భాగంగా జరిగి ఉంటాయన్న ప్రచారం బలంగా సాగుతోంది. బీఆర్ఎస్ నేతలతో సన్నిహితంగా ఉన్నారని భావిస్తున్న వారిని కీలక స్థానాల నుంచి తప్పించటం.. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో పని చేసిన వారిపైనే ఎక్కువగా ఫోకస చేసినట్లుగా తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీగా అవకతవకలు జరిగినట్లుగా భావిస్తున్నారు. వీటిపై పూర్తిస్థాయిలో విచారణ చేయించాలని ప్రభుత్వం డిసైడ్ అయినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం అనుమానించినట్లే ఇటీవల కాలంలో పట్టుబడుతున్న ఇంజనీర్లు వందల కోట్లకు పైగా అక్రమ ఆస్తులే దీనికి నిదర్శనంగా చెబుతున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో సాగునీటి రంగానికి పెద్ద పీట వేయటం.. ఇందులో భాగంగా కొందరు ఇంజినీర్లకు బీఆర్ఎస్ ముఖ్యనేతలతో సన్నిహిత సంబంధాలు ఏర్పడినట్లుగా భావిస్తున్నారు. ఈ అనుమానాన్ని బలపర్చేలా నిఘా వర్గాల నివేదిక సమాచారం ఉందని చెబుతున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ఉండాల్సిన పలు ఫైళ్ల కాపీలు.. ప్రతిపక్ష నేతల వద్దకు వెళ్లటంపై శాఖలోని కీలక నేతలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. ఈ తీరుపై రేవంత్ సర్కారు సీరియస్ గా ఉండటమే కాదు.. ఇలా ంటి తప్పుడు పనులకు పాల్పడుతున్న వారికి చెక్ పెట్టేలా చర్యలు చేపట్టాలన్న ఆదేశాల్ని ప్రభుత్వం ఇచ్చినట్లుగా చెబుతున్నారు. ప్రభుత్వాలు మారతాయి. అధికారులు మారరు. ఈ విషయాన్ని అధికారులు ఎందుకు మిస్ అవుతున్నట్లు? అన్నది అసలు ప్రశ్న.

# సభ్యత్వ నమోదులో బీజేపీ సరికొత్త రికార్డు



న్యూఢిల్లీ,భారతీయ జనతా పార్టీ పూర్వం జనసంఘ్ కాలం నుంచి ఈ దేశంలో ఒక రాజకీయ పార్టీగా ఉంది. నిజం చెప్పాలంటే బీజేపీ రాజకీయ ప్రస్థానం జనసంఘ్ గా 1953లో ప్రారంభం అయింది. అంటే ఈ రోజుకు డెబ్భై ఏళ్ళ పై దాటిన పార్టీ అన్న మాట. జనసంఘ్ లో బీజేపీకి దీపం గుర్తు ఉండేది. అలా దీపం గుర్తుగా ఉన్న పార్టీకి దేశవ్యాప్తంగా బలం లేదు. మెల్లగా ఉనికి చాటుకుంటూ వచ్చింది. అంతే కాదు ఉనికి పోరాటాన్నే దశాబ్దాలుగా చేసింది. ఇక 1977లో జనతా పార్టీగా చాలా పార్టీలు కలసిపోయిన నేపథ్యంలో జనసంఘ్ కూడా అందులోనే విలీనం అయింది. అలా ఆ ఎన్నికల్లో మాత్రం పెద్ద ఎత్తున విజయాలు సాధించింది. అప్పటి నుంచే ఎదుగుదల మీద ఫోకస్ పెట్టింది. ఆ తరువాత జనతా పార్టీ విచ్ఛిన్నం కావడంలో బీజేపీగా 1980 ప్రాంతంలో ఏర్పాటు అయింది. అయితే ఈ ఎదుగుదల కోసం బీజేపీ ఎదుగుదల కోసం ఒక దశాబ్దం పాటు వేచి చూడాల్సి వచ్చింది. పార్టీ సభ్యత్వ నమోదు కూడా ఒక మాదిరిగా సాగేది. అయితే 1990 నుంచి బీజేపీ విస్తరిస్తూ ఆ తరువాత వాజ్ పేయి నాయకత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. అయితే బీజేపీ అసలైన రాజకీయ దూకుడు అంతా 2014 నుంచి మొదలైంది. ఆ ఎన్నికల్లో బీజేపీ బ్రహ్మాండమైన గెలుపు సాధించింది. నరేంద్ర మోడీ ప్రధాని అయ్యారు ఆయన నాయకత్వంలో నాటి నుంచి బీజేపీ అప్రతిహత విజయాలను నమోదు చేస్తోంది. ఇక రికార్డు స్థాయి సభ్యత్వాలను కూడా నమోదు చేయాలని పట్టుబట్టి ప్రపంచ రికార్డు కోసం చూస్తూ వస్తోంది. ఈ రోజున చూస్తే బీజేపీ ఆ రికార్డు సాధించినట్లుగానే ఉంది అని అంటున్నారు. ప్రస్తుతం బీజేపీకి దేశవ్యాప్తంగా ఉన్న సభ్యత్వం 14 కోట్లు అంటే ఆశ్చర్యం వేయడమే కాదు రాజకీయంగా ప్రకంపనలు పుట్టించేలా ఉంది. మరో వైపు చూస్తే కనుక అతి తక్కువ సమయంలో ఈ గ్రేట్ రికార్డ్ ని బీజేపీ సాధించింది అని అంటున్నారు. ఇక చూస్తే కనుక 14 కోట్ల మార్కును బీజేపీ ప్రాథమిక సభ్యుల సంఖ్యతో దాటిందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ తెలిపారు. బీజేపీ ఒక ప్రణాళికతో బూత్ స్థాయి సభ్యుల సహకారంతో ఈ నంబర్ ని సాధించింది. పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా మారాలంటే కనీసం 50 మందిని చేర్పించాలన్న నిబంధనతో నే ఇంత పెద్ద ఎత్తున సభ్యత్వం కాషాయం పార్టీకి దక్కింది అని అంటున్నారు. ఇక బీజేపీ జాతీయ సభ్యత్వ ప్రచారాన్ని 2024 సెప్టెంబర్ 2న ప్రారంభించింది. బీజేపీ కేంద్ర కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ దీనిని ప్రారంభించారు. ఇక ఈ కార్యక్రమానికి సంఘటన్ పర్వ్ సభ్యత్వ ప్రచారం-2024 అన్న పేరు పెట్టారు. కేవలం నెలన్నర రోజులలోనే అంటే అక్టోబర్ 15 నాటికి బీజేపీ సభ్యుల సంఖ్య తొమ్మిది కోట్లు దాటిందని పార్టీ పేర్కొంది. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే బీజేపీ రెండు కోట్ల మంది సభ్యులను కలిగి ఉన్నట్లు ఆ పార్టీ పేర్కొంది. ఇక రెండవ దశలో చూస్తే సభ్యత్వ నమోదు మరింతగా పెరిగి 14 కోట్లకు చేరుకుంది. ఇక పార్టీ క్రియాశీల సభ్యత్వ సంఖ్యను మరింత పెంచే లక్ష్యంతో మూడవ దశ కూడా తాజాగా ప్రారంభమైందని పార్టీ నేతలు చెబుతున్నారు. మరి ఈ సభ్యత్వం కూడా ముగిస్తే బీజేపీలో ఎంత సభ్యత్వం నమోదు అవుతుందో చూడాలి. ఏకంగా 20 కోట్ల టార్గెట్ ఏమైనా పెట్టుకుంటారా అన్న చర్చ సాగుతోంది.

# జగన్‌ది నేర పూరిత నిర్లక్ష్యం: మాణిక్కం ఠాకూర్



అమరావతి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఆ పార్టీ ఏపీ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్కం ఠాకూర్.. వైసీపీ అధినేత జగన్ పై తొలిసారి విమర్శలు గుప్పించారు. గతంలో అనేక ఆరోపణలు వచ్చినా.. జగన్‌పై పన్నెత్తు మాట అనని ఠాకూర్ తాజాగా గుంటూరు జిల్లా రెంటపాళ్ల సమీపంలో జగన్ కారు కింద పడి సింగమయ్య అనే వృద్ధుడు మృతి చెందిన ఘటనపై సీరియస్ కామెంట్లే చేశారు. దీనిని ఖండిస్తున్నట్టు తెలిపారు. జగన్ నాయకుడుకాదన్నారు. ఆయనలో నాయకత్వలక్షణాలు కూడా లేవని ఠాకూర్ వ్యాఖ్యానించారు. అసలు అంత మంది జనాన్ని తరలించేందుకు.. అదేమైనా ఎన్నికల ప్రచారమా? అని నిలదీశారు. అంతేకాదు.. కారు డోర్ పక్కన నిలబడి.. చేతులు ఊపుకుంటూ.. ఎందుకు ప్రయాణించాల్సి వచ్చిందో జగన్ చెప్పాలని ఠాకూర్ నిలదీశారు. ఒక వ్యక్తి ఎప్పుడో చనిపోతే.. ఇప్పుడు పరామర్శించారు. ఈ పర్యటన ద్వారా మరో ఇద్దరిని బలితీసుకున్నారని అన్నారు. "సింగమయ్య మృతి చెందిన తీరు నన్ను ఎంతో కలచి వేసింది. ఇది జగన్ బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ఠ. ఆయనలో నాయకుడి లక్షణాలులేవు. ఒక నాయకుడిగా ఆయన ఎప్పుడో విఫలమయ్యాడు. ఇప్పుడు నేర పూరిత నిర్లక్ష్యం ప్రదర్శించారు. మనుషుల జీవితాలంటే.. జగన్‌కు అర్థం కూడా తెలియదు. ఎవరు ఏమైపోయినా.. తన కాంక్ష తీర్చుకునే క్రమంలో వ్యవహరించినట్టు స్పష్టంగా తెలుస్తోంది. దీనిపై తీసుకునే కఠిన చర్యలకు తాము మద్దతు ఇస్తాం." అని మాణిక్కం ఠాకూర్ వ్యాఖ్యానించారు.

### కడప కమిషనర్‌కు మేయర్ షోకాజ్ నోటీసు

కడప,కడప మున్సిపల్ కమిషనర్ సహా ఏడుగురు ఉద్యోగులకు మేయర్ సురేశ్ బాబు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధులు సరిగా నిర్వహించలేదని, వారంలో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. మేయర్ అధ్యక్షతన కడప కార్పొరేషన్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఈ ఏడుగురు ఉద్యోగులు హాజరుకాలేదు. దీంతో మేయర్ సురేశ్ బాబు వారికి షోకాజ్ నోటీసులు పంపారు. సమావేశానికి ఎందుకు రాలేదో సరైనా వివరణ ఇవ్వాలని తెలిపారు.

Printed, Published & Owned by MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From SPOORTHI PUBLICATIONS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: MEDE SHANTHI KUMAR.